# అధినేత రాకతో.. టిడిపిలో ఉత్సాహం

## - చంద్రబాబు పర్యటనకు భారీ జనం
## - ప్రభుత్వంపై వ్యక్తమైన వ్యతిరేకత

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

**అధినేత రాకతో టిడిపి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. చంద్రబాబు జిల్లా పర్యటనకు భారీగా జనం హాజరయ్యారు. అనేక మందిలో ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమైంది...**

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఈ నెల 16 నుంచి 18 వరకూ జిల్లాలో పర్యటించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయన పర్యటనకు ప్రధాన్యత సంతరించుకుంది. చంద్రబాబు మూడు రోజుల పర్యటనలో భాగంగా తొలి రోజు ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి పత్తికొండకు చేరుకుని అక్కడ నిర్వహించిన బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. కొడుమూరు, దేవనకొండ మీదుగా రోడ్ షో సాగింది. రాత్రికి ఆదోనిలో బస చేశారు. రెండో రోజు ఆదోని నుంచి ఎమ్మిగనూరు వరకూ రోడ్‌షో నిర్వహించి ఎమ్మిగనూరులో బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రికి కర్నూలులో బస చేశారు. మూడో రోజు ఉదయం పార్లమెంట్ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. టిడిపి జిల్లా కార్యాలయం వద్ద ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం కర్నూలు శివారుల్లోని టిడ్కో గృహాలను, కబ్జాకు గురైన బి.తాండ్రపాడు చెరువును పరిశీలించారు. అనంతరం జిల్లా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు. ఈ మూడు రోజుల పర్యటనతో టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. అధినేత రాకతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ధైర్యం పెరిగింది. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలపై వేసిన భారాలను, అక్రమాలను వివరిస్తూ చంద్రబాబు ముందుకు సాగారు. చంద్రబాబు పర్యటనకు టిడిపి కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో అధికార వైసిపిపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బహిరంగంగా వక్తమైంది. కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజానీకం కూడా చంద్రబాబు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపారు. దీంతో పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు వీధులు

ఆదోనిలో చంద్రబాబు రోడ్‌షోకు హాజరైన జనం (ఫైల్)

జనంతో కిక్కిరిసి పోయాయి. జనం నుంచి వచ్చిన స్పందనతో టిడిపి నాయకుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపింది. తన ప్రసంగంతో పార్టీ శ్రేణులను రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం చేసినట్లు కనిపించింది.

**వీరికి అభ్యర్థిత్వం ఖరారు..?**

చంద్రబాబు నాయుడు పర్యటనలో కొన్ని నియోజకవర్గాల్లో టిడిపి తరపున పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ఖరారు చేసినట్లు సమాచారం. పలు చోట్ల మాట్లాడిన సందర్భంగా కొందరి పేర్లను ఆయన ప్రస్తావించారు. వారిని ఆదరించాలని కూడా కోరారు. పత్తికొండ నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా కెఇ శ్యాంబాబు, ఎమ్మిగనూరు టిడిపి అభ్యర్థిగా బివి జయనాగేశ్వర్‌రెడ్డి, మంత్రాలయం టిడిపి అభ్యర్థిగా తిక్కారెడ్డి పేర్లను దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

### కట్టడిలో పోలీసులు విఫలం

ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు పర్యటనలో చాలా ప్రాంతాల్లో వైపిపి నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. మూడు రాజధానులకు చంద్రబాబు మద్దతు ప్రకటించాలని, చంద్రబాబు గో బ్యాక్ అంటూ నిరసనలు చేపట్టారు. పత్తికొండ, ఎమ్మిగనూరుతో పాటు కర్నూలులో మౌర్యా ఇన్, బుధవారపేట, టిడిపి కార్యాలయం, టిడ్కో గృహాల వద్ద ఈ నిరసన సన్నివేశాలు కనిపించాయి. ముఖ్యమంత్రి సందర్భంగా లేదా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేసేందుకు పిలుపులు ఇచ్చినా, ఇవ్వకపోయినా ముందస్తుగా వామపక్ష నాయకులను, యువజన, విద్యార్థి సంఘాల నాయకులను, ప్రతిపక్ష నేతలను పోలీసులు నిర్బంధించడం ఆనవాయితీ అయిపోయింది. అలాంటి పోలీసులు అధికార పక్ష నాయకులను కట్టడి చేయడంలో పోలీసులు విఫలం అయ్యారని బహిరంగంగా తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జడ్ ప్లస్ భద్రత ఉన్న ఒక మాజీ ముఖ్యమంత్రిని అడ్డగించినా, నిరసనలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా పోలీసులు ఏ మాత్రం చర్యలు తీసుకోలేదు. పైగా టిడిపి నాయకులనే నిలువరించారు. పోలీసులపై చంద్రబాబు తన వ్యాఖ్యలతో తీవ్రంగా విరుచుకుపడ్డారు. "మీకు చేత కాకపోతే ఖాకీ బట్టలు తీసేయండి..వారి పని మేమే చూసుకుంటాం..ఎస్పీ ఎవరికి కాపలా కాస్తున్నారు.." అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

### స్పష్టత లేని హామీలు

చంద్రబాబు పర్యటన విజయవంతం ఒక వైపు అయితే మరో వైపు జిల్లాకు తాము ఏం చేస్తారో అన్న దానిపై చంద్రబాబు ప్రసంగాల్లో స్పష్టత లేదు. గతంలో చంద్రబాబు హామీ ఇచ్చిన గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులతో పాటు సీడ్ పార్క్, ఉల్లి రైతులను ఆదుకోవడం, వలసల నివారణ వంటివి వారి ప్రభుత్వ హయాంలో నెరవేర్చలేకపోయారు. దీంతో జిల్లాలో టిడిపికి ఒక్క సీటు కూడా రాకుండా పోయింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు మొదలు పెట్టిన వాటిని కూడా పూర్తి చేయలేక పోతుండటంతో పాటు జిల్లా అభివృద్ధి ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడంతో ఈ సారి వైసిపి మీద వ్యతిరేకత వ్యక్తమవుతుందని ప్రజలు చెబుతున్నారు. టిడిపి, వైసిపి రెండు ప్రభుత్వాల్లోనూ జిల్లాకు న్యాయం జరగడం లేదని అంటున్నారు.

---

దోమల నియంత్రణతోనే

# జ్వరాల నుంచి ఉపశమనం

**- జిల్లాలో పెరుగుతున్న డెంగీ కేసులు**
**-ప్రజాశక్తితో జిల్లా మలేరియా అధికారి ఎ.నూకరాజు**

"దోమలను నిర్దేశించిన పద్ధతులతో నియంత్రిస్తేనే విషజ్వరాలు తగ్గిపోయి ప్రజలు ఉపశమనం పొందవచ్చు. దోమ కాటు వల్ల డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు, ఫైలేరియా వ్యాధులు వస్తాయి. ప్రధానంగా ఇన్ఫెక్టెడ్ ఆడ ఏడీస్ ఈజిప్టే దోమ కాటు వల్ల డెంగ్యూ, ఇన్ఫెక్టెడ్ ఆడ ఎనాఫిలిస్ దోమ కాటు వల్ల మలేరియా, ఆడ క్యూలెక్స్ దోమ వల్ల మెదడు వాపు, ఆడ ఏడీస్ దోమ కాటు వల్ల చికున్ గున్యా వ్యాధులు సంభవిస్తాయి. జబ్బు చేసిన వారిని కుట్టిన దోమ మరల మరో ఆరోగ్య వంతమైన వ్యక్తిని కాటు వేస్తే సంబంధిత వ్యాధి వేగ వంతంగా వ్యాప్తి చెందుతుంది." అని జిల్లా మలేరియా అధికారి ఎ.నూకరాజు తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖా ముఖిగా మాట్లాడి పలు విషయాలను వెల్లడించారు...

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**

**దోమ కాటు వల్ల ఎలాంటి రోగాలు వస్తాయి? జిల్లాలో పరిస్థితి ఎలా ఉంది?**

**అధికారి :** దోమ కాటు వల్ల డెంగీ, మలేరియా, చికున్ గున్యా, డెంగీ ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులు వస్తాయి. జిల్లాలో డెంగ్యూ జ్వర పీడితులు అధికంగా ఉన్నారు. ఈ ఏడాదిలో 249 కేసులు నమోదు అయ్యాయి. గత ఏడాదిలో 173 కేసులతో పోల్చితే జ్వర పీడితులు అధికమయ్యారు. అలాగే మలేరియా కేసులు గత ఏడాది 18 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటివరకు 6 కేసులు నమోదయ్యాయి. ఫైలేరియా, మెదడువాపు, చికున్ గున్యా వ్యాధులు బాగా తగ్గుముఖం పట్టాయి.

**వైరల్ జ్వరాలు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

**అధికారి :** వైరల్ జ్వరాలు ఒకరి నుంచి ఒకరికి దోమ కాటు వల్ల వ్యాప్తి చెందుతాయి. దోమలను నియంత్రించడానికి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. ఇళ్లల్లో గోడలపై దోమల మందు చల్లించుకోవాలి. ఆరుబయట నిద్రించకూడదు. దోమతెరలు వాడాలి. ఇంటి కిటికీలకు, తలుపులకు జాలీలు బిగించుకోవాలి. వర్షపు నీరు నిల్వ ఉండగలిగిన టైర్లు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, ఖాళీ డబ్బాలు ఇంటి పరిసర ప్రాంతాలలో ఉంచకుండా పారవేయాలి. చిన్నారులకు ఫుల్ షర్టు, ప్యాంటు వేయించి పాఠశాలలకు పంపించాలి.

**డెంగీ, మలేరియా వ్యాధులకు చికిత్సలేమిటి?**

**అధికారి :** మలేరియా వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే వైద్యుని సంప్రదించి మలేరియా మందులను పూర్తి మోతాదులో సూచించిన విధంగా తీసుకోవాలి. మధ్యలో మానివేస్తే వ్యాధి మళ్లీ వస్తుంది. మలేరియా మందులు ఖాళీ కడుపుతో మింగ రాదు. డెంగీ వ్యాధి వైరస్ వల్ల కలుగుతుంది పూర్తి చికిత్స లేదు. లక్షణాలు బట్టి వైద్యులిచ్చే ఉపశమన చర్యలు తీసుకోవాలి. అశ్రద్ధ చేస్తే ఈ వ్యాధి ప్రాణాంతకం అవుతుంది.

**వ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఎక్కడ ఉన్నాయి?**

**అధికారి :** డెంగీ ఎలిసా పరీక్షలు చేయడం ద్వారా వ్యాధి నిర్ధారణ అవుతుంది. ఈ పరీక్షలు ఆదోని ఏరియా ఆసుపత్రి, నంద్యాల జిల్లా ఆస్పత్రి, కర్నూలు జిజిహెచ్‌లో చేస్తారు. ప్రైవేట్ ఆస్పత్రులలో కేవలం ఆర్‌డిటి పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షలో పాజిటివ్ ఫలితం వస్తే వాటిని ప్రభుత్వ ఆసుపత్రుల్లోని కేంద్రాలకు రెఫర్ చేసి నిర్ధారించుకుంటారు. అనంతరం వ్యాధి సమాచారాన్ని బట్టి చికిత్సలు అందిస్తారు. మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్‌ల సిబ్బంది ప్రభుత్వ నిర్దేశించిత కార్యక్రమాలను చేపడుతున్నారు.

---

# ప్రమాద రహిత సమాజం అవసరం

**ప్రపంచ రోడ్డు ట్రాఫిక్ బాధితుల సంస్మరణ దినోత్సవంలో అధికారులు**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

ప్రమాద రహిత సమాజం కోసం పాటుపడదామని కర్నూలు డిటిసి శ్రీధర్, కర్నూలు ట్రాఫిక్ డిఎస్‌పి నాగభూషణం, కర్నూలు డిఎస్‌పి కెవి.మహేష్ అన్నారు. కర్నూలు నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఆధ్వర్యంలో ప్రపంచ రోడ్డు ట్రాఫిక్ బాధితుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని యువత, వాహన దారులకు రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్‌లో ప్రతి మూడో ఆదివారం రోడ్డు ట్రాఫిక్ గాయాల బాధితులకు, వారి కుటుంబాలకు తగిన గుర్తింపుగా నిబంధనలు పాటించాలని రోడ్డు ట్రాఫిక్ బాధితుల కోసం ప్రపంచ దినోత్సవంలో దిశ నిర్దేశం చేశారు. రోడ్లపై అనేక మిలియన్ల మంది మరణించిన వారు, తీవ్రంగా గాయపడిన వారిని గుర్తుంచుకోవడం బాధితులు, కుటుంబాల బాధలను గుర్తించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. వరల్డ్ ట్రాఫిక్ విక్టిమ్స్ రిమెంబరెన్స్ డే సందర్భంగా జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాలతో ప్రమాదాల నియంత్రణకు తమవంతు సహకారాన్ని అందించే ఆటో డ్రైవర్లు, గాయపడి క్షత గాత్రులకు సహాయపడే ప్రజలు, వైద్యం అందించే వైద్యులు, రహదారి భద్రత పట్ల అవగాహన కల్పించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. రహదారి భద్రతా నియమాలు పాటించడంతోనే ప్రమాదాలను నియంత్రించ వచ్చన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారిని రక్షించేందుకు స్థానికులు ముందుకు రావాలన్నారు. అటువంటి వ్యక్తులను కోర్టులకు,పోలీసు స్టేషనుకు పిలిచి, వేధింపులకు గురి చేస్తారన్న అపోహలు వద్దన్నారు. ప్రమాదాల్లో అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల్లో జీవనం అగమ్యగోచరమన్నారు. ప్రమాదాల్లో మరణించిన వారిని స్మరించుకుంటూ వారి కుటుంబసభ్యులతో కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలిపారు. రోడ్డు ప్రమాదాలు చేయని ఉత్తమ డ్రైవర్లను గుర్తించి వారిని, ప్రమాదాలపై ప్రజల్లో చైతన్యం పెంచడంలో మీడియా పాత్రను గుర్తించి జర్నలిస్టులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఎ రమేష్, న్యూరో సర్జన్ చంద్రశేఖర్, ఆర్థో సర్జన్ ఎంఎస్.రాజేష్, ఆటో, ఆర్‌టిసి లారీ డ్రైవర్లు,బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

---

# పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుంది

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో కలెక్టర్, తదితరులు

పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుంది, గ్రంథాలయంలోని పుస్తకాలతో సమాజానికి మంచి జరుగుతుందని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ , జిల్లా పరిషత్ ఛైర్మన్ పాపిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మద్దూర్ సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన సభ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయంలోని పుస్తకాలతో ఎంతో మంచి జరిగిందన్నారు. మనపూర్వీకుల అనుభవాలను, వారి జ్ఞానాన్ని మనకు పుస్తక రూపంలో అందిస్తారన్నారు. వాటి వలన మనం ప్రస్తుత టెక్నాలజీతో ఆధునికమైన ప్రపంచాన్ని నిర్మించుకుంటున్నామన్నారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ వై.పాపిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సందర్శించి అక్కడి జ్ఞాన సంపదను సేకరించి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మద్దూర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునికంగా నూతన టెక్నాలజీతో మార్పులు చేస్తూ పాఠకులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేలా గ్రంథాలయ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. కలెక్టర్, జిల్లా పరిషత్ ఛైర్మన్ ప్రశంసా పత్రాలు , బహుమతులు ప్రదానం చేశారు. సహాయ గ్రందాలయాధికారి వజ్రాల గోవిందరెడ్డి, గ్రంథాలయ అధికారులు ఎస్.బాషా, చంద్రమ్మ నషీమాబీ, మగ్బుల్ బాష ,సుదర్శన్, రాజు తదితర ఆఫీస్ సిబ్బంది డిసిఎల్ రికార్డ్ అసిస్టెంట్లు ఈశ్వరమ్మ , శ్రీనివాసులు, బాస్కర్,ఉమ, ప్రజలు, పాఠకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

---

క్రీడాకరులను పరిచయం చేస్తున్న సిఇఒ రమణ

# క్రీడలతో ఆత్మవిశ్వాసం

**-జిల్లా క్రీడా శాఖ సిఇఒ రమణ**
**- జిల్లాస్థాయి డెఫ్ క్రీడా పోటీలు ప్రారంభం**

**ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్:** వినికిడి లోపం ఉన్న ఆత్మస్థైర్యంతో క్రీడల్లో పాల్గొనాలని జిల్లా క్రీడా శాఖ సిఇఒ రమణ వ్యాఖ్యానించారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లాస్థాయి డెఫ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా క్రీడా శాఖ సిఇఒ రమణ, డెఫ్ జిల్లా సంఘం అధ్యక్ష కార్యదర్శులు వాసుదేవరెడ్డి, సాదిక్‌బాషా పాల్గొని పోటీలను ప్రారంభించారు. అనంతరం సిఇఒ రమణ మాట్లాడుతూ ఆత్మస్థైర్యంతో క్రీడా పోటీల్లో పాల్గొని విజేతలు కావాలని ఆకాంక్షించారు. కర్నూలు నగరానికి చెందిన అంతర్జాతీయ డెఫ్ ఛాంపియన్‌లో షేక్ జఫ్రీన్‌ను స్ఫూర్తిగా తీసుకొని మరింత క్రీడల్లో రాణించాలన్నారు. వాలీబాల్, అథ్లెటిక్స్, లాన్ టెన్నిస్ లాంటి క్రీడల్లో స్త్రీ పురుషుల విభాగంలో పాల్గొన్నారు. సాయంకాలం గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. లాన్ టెన్నిస్ స్త్రీ విభాగంలో : షేక్ జఫ్రీన్, పురుషుల విభాగంలో సాయి చందన్, వేదవచ్చన్ లు ఎంపికయ్యారు. ఈ పోటీలలో కర్నూలు నంద్యాల జిల్లాలకు సంబంధించిన క్రీడాకారులు సుమారు 60 మంది పోటీల్లో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : ఎస్‌పి

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

రోడ్డు ప్రమాదాల నివారణకు అనేక చర్యలు తీసుకుంటున్నామని, జిల్లా పోలీసు యంత్రాంగం సమిష్టిగా కృషి చేసి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ సూచించారు. నవంబర్ 13 నుండి 19 వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు తీసుకున్న చర్యల వివరాలను ఆదివారం విడుదల చేశారు. ఇందులో ప్రధానంగా వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్సులు లేని వారిపై 289 కేసులు, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన చోదకులపై 1,489, మైనర్ల పై 54 , ఒన్‌వే లో రాంగ్‌రూట్ వెళ్ళిన వారిపై 75, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడిపిన వారిపై 138, ఏలాంటి రికార్డులు పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన వారి పై 1,989 , సీటు బెల్టు ధరించకుండా వెళ్తున్న కార్లు , జీపులు , తదితర వాహన చోదకుల పై 59 కేసులు నమోదు చేశామన్నారు. అతి వేగంతో వెళ్లి న వాహనాల పై 563 కేసులు, ఓవర్ లోడ్ తో వెళ్ళిన వాహనాల పై మోటారు వాహనాల చట్టం కింద 54, త్రిబుల్ రైడింగ్ పై 308 మంది, రాంగ్ పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాల పై 159 , రాంగ్ పార్కింగ్ చేసిన త్రీ వీలర్ , ఫోర్ వీలర్ వాహనాల పై 134 , నంబర్ ప్లేట్ లేని వాహనాల పై 136 కేసులు నమోదయ్యాయన్నారు. మొత్తం 5 లక్షల 50 వేల ఇ- చలనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఈ వారంలో 8,894 ఈ-చలనాలను (రూ.22 లక్షల 40 వేల 210 రూపాయలను) రికవరీ చేశామన్నారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ప్రజలను కోరారు.

---

# క్రమశిక్షణకుమారుపేరు సుబ్బయ్య

**కర్నూలు కార్పొరేషన్ :**

సమావేశంలో మాట్లాడుతున్న గౌస్ దేశాయి

కార్మికుల పక్షాన నిలిచిన జి .సుబ్బయ్య తుది శ్వాస వరకు పార్టీ కోసం కృషి చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. ఆదివారం సిఐటియు న్యూ సిటీ కమిటీ అధ్యక్షులు ఆర్.నరసింహులు అధ్యక్షత జి. సుబ్బయ్య ఐదవ వర్ధంతి సభ కార్మిక కర్షక భవన్‌లో నిర్వహించారు. జి. సుబ్బయ్య చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ జి.సుబ్బయ్య చివరి దాకా కార్మికుల హక్కుల కోసం, కార్మికుల క్షేమం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. క్రమశిక్షణకు, నీతి, నిజాయితీకి మారుపేరుగా ఉండి ఎన్ని ఆటుపోట్లు వచ్చినా తట్టుకొని శ్రమజీవుల కోసం తన జీవితాన్ని త్యాగం చేశాడన్నారు. పేపర్ మిల్లులో ఉద్యోగంలో చేరిన నాటినుండి కార్మికుల పక్షాన కంపెనీ యజమానులతో ఏ రోజు కూడా రాజీ లేకుండా పోరాటం చేశారన్నారు. సిపిఎం న్యూ సిటీకార్యదర్శి టి.రాముడు, సిఐటియు న్యూ సిటీ నగర కార్యదర్శి సిహెచ్.సాయిబాబా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.నారాయణ, సిఐటియు జిల్లా నాయకులు ఎం.గోపాల్, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, సిఐటియు నగరనాయకులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లా డుతూ సుబ్బయ్యను స్ఫూర్తిగా తీసుకుని కార్మిక పోరాటాలను ముందుకు నడిపించా లన్నారు. సి.చలపతి, వెంక ట్రాముడు, వలి, ఆర్‌టిసి స్వీపర్స్ యూనియన్ నాయకుడు దేవరాజు, కార్మికులు పాల్గొన్నారు.

---

## 17వ వార్డు సమస్యలను పరిష్కరించాలి: సిపిఎం

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ :** కర్నూలు 17వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ కోరారు. కర్నూలు సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో 17వ వార్డు శాఖ కార్యదర్శి చంద్ర అధ్యక్షతన వార్డు పర్యటనలో భాగంగా ఆదివారం సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగర కార్యవర్గ సభ్యులు ఎం. విజయ్, నగర కమిటీ సభ్యులు ఆర్. కృష్ణ, నాగరాజు, పెద్దబాషలు పాల్గొని గిరిప్రసాద్‌నగర్, ఎల్బీజీ నగర్, లక్ష్మీ గార్డెన్ కొట్టాలలో వార్డు పర్యటించారు. ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ గిరి ప్రసాద్‌నగర్, ఎల్‌బిజి నగర్ ఏర్పడి 30 సంవత్సరాలైన ప్రభుత్వాలు మారుతున్నాయని, ఇక్కడ సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. ప్రతి వర్షాకాలంలో సుద్ద వాగు పొంగిపొర్లినప్పుడు రక్షణ గోడ లేనందున గిరి ప్రసాద్ కాలనీవాసులు తమ పిల్లలు ఎక్కడ పడిపోతారో అని, అలాగే వచ్చిన మురుగు, వాసన వలన అనారోగ్యాలకు గురవుతారేమోనని భయంతో తన ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని బతకాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. ప్రజా ప్రతినిధులకు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య ను పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్, బజారి, రాజశేఖర్, మహేంద్ర, బాలరాజు, సాయి, రమేష్, మద్దిలేటి, రాజు తదితరులు పాల్గొన్నారు.

---

## జగన్ పాలన జనరంజకం : కాటసాని

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**



రాష్ట్రంలో ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన జనరంజకంగా కొనసాగ ుతుందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 26 వ వార్డు 65 వ సచివాలయం విఠల్ నగర్‌లో గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, స్థానిక వార్డ్ కార్పొరేటర్ దండు లక్ష్మీకాంత్ రెడ్డి, స్టాండింగ్ కమిటీ మెంబర్ సాన శ్రీనివాసులు, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, సాపూరు మాధురి, మిద్దె చిట్టెమ్మ, కాశపోగు జయరాముడు, సుదర్శన్ రెడ్డి, నారాయణరెడ్డి, మైతాపు నరసింహులు, ఎరుకల వెంకటేశ్వర్లు, వైజా బాల చంద్రారెడ్డి, కల్లూరు జడ్‌పిటిసి ఆల ప్రభాకర్ రెడ్డి, కల్లూరు సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి పురస్కారానికి మారుతీ పౌరోహితం కథ

**ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్**



కథాసాహిత్యానికి అగ్రపీఠం వేస్తూ తెలుగురాష్ట్రాల్లో కథకులను కథాసాహిత్యాన్ని ప్రోత్సహిస్తూ ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక ఖమ్మం ఈస్తటిక్స్ సాహితీ అవార్డులలో ఒక అవార్డు ఈ ఏడాది కర్నూలు జిల్లాకు మారుతీ పౌరోహితంను వరించింది. మాండలిక భాషారచనలో మానవీయ విలువల రంగులనద్ది హృద్యంగా కథలను అందిస్తున్నారు. ఆయన రాసిన **'కుశలంబేగదా ఆంజనేయ'** కథకు రూ.10 వేల బహుమతి వరించింది. ఖమ్మం ఈస్తటిక్స్ సాహిత్య పోటీకి కథలను, కవిత్వ సంపుటాలను ఆహ్వానించగా స్పందించిన తెలుగు కవులు 100కు పైగా కవితా సంపుటులు120కి పైగా కథలు పరిశీలనకు రాగా కమిటీ అభ్యర్థన మేరకు కవిత్వానికి ముగ్గురు, కథలకు ముగ్గురు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కవిత్వం విభాగంలో పసునూరు శ్రీధర్ బాబు సంపుటి "నిదురపోని మెలకువ చెప్పిన కల" రూ.40వేల బహుమతిని గెలుచుకోగా మరో ఇద్దరికి ప్రత్యేక ప్రశంసగా అవార్డులు ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. రేఖాజ్యోతి కవిత్వ సంపుటి " ఆగిన చోటునుంచే మళ్ళీ ", భారతి కోడె కవితా సంపుటి "ఎన్నో రంగుల చీకటి " ప్రత్యేక ప్రశంసకు అర్హతగా ఎంపికయ్యాయి. కథల విభాగంలో ఉత్తమ కథగా సయ్యద్ సలీం రచన ' హరామీ రూ.25 వేలు బహుమతిని గెలుచుకోగా ద్వితీయ ఉత్తమ కథగా దేశరాజు రవికుమార్ రచన 'సహజాసహజం ' రూ.15 వేల బహుమతిని , తృతీయ ఉత్తమ కథగా మారుతి పౌరోహితం కథ 'కుశలంబే కదా ఆంజనేయ ' రూ.పదివేలు గెలుచుకున్నది.డిసెంబర్ 5న ఖమ్మంలో జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డ్ అందించనున్నట్టు కమిటీ ప్రకటించింది.

---

మ్రాట్లాడుతున్న కె.బలరాం

## కార్పొరేటుకు దీటుగాగా వైద్యం అందించాలి

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :** కర్నూలు జిల్లాలో ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కార్పొరేట్ కు దీటుగా వైద్యం అందించాలని ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు కె.బలరాం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కొత్త బస్టాండ్‌లో ఉన్న ప్రజా పరిరక్షణ సమితి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లు, స్టాఫ్ నర్సుల కొరత ఏర్పడిందన్నారు. డాక్టర్లు, బయోమెట్రిక్ వేసి డ్యూటీలో ఉండకుండా, ప్రైవేట్ హాస్పిటల్లో పనిచేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, విజిలెన్స్ అధికారులచేత ,రిపోర్టు తీసుకొని, విధులకు హాజరు కానీ, డాక్టర్లు పై చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా పరిరక్షణ సమితి నాయకులు, డేవిడ్, శివమణి, రమేష్, రవికుమార్, రామకష్ణుడు, పురుషోత్తం, చిట్టెన్న, ఎం రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పథకంలో కొత్త మెను

**ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్**

విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ' ఆహారాన్ని మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి , అసిస్టెంట్ డైరెక్టర్ సామెల్ పాల్ పేర్కొన్నారు. ఆదివారం విలేకరులతో వారు మాట్లాడుతూ సోమవారం హాట్‌పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు, కూరగాయల పులావ్, కోడిగుడ్డుకూర, చిక్కీ వడ్డించాలన్నారు. మంగళవారం నాడుచింతపడు, నిమ్మకాయ పులిహోరా, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు ,బుధవారం కూరగాయల అన్నం, బంగాళదుంపకుర్మా, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ విద్యార్థులకు అందించాలన్నారు. గురువారం సాంబార్‌బాత్, ఉడికించిన కోడిగుడ్డు శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీలు విద్యార్థులకు వడ్డించాలన్నారు. శనివారం ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపిపొంగలి విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద వడ్డించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను కోరారు.

## పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన తహశీల్దార్

**ప్రజాశక్తి-సి బెళగల్**

మండలంలోని బ్రాహ్మణదొడ్డిలో తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆదివారం ప్రత్యేక పోలింగ్ సేవల కేంద్రాన్ని తనిఖీ చేశారు. విఆర్‌ఒ జాకిర్ అధ్యక్షతన ఓటు హక్కు కోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలించారు. ఇక్కడే 18 ఏళ్ళు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు పొందేలా అవగాహన విస్తృతం చేయాలని ఆయన సూచించారు.

బ్రాహ్మణదొడ్డిలో తహశీల్దార్ తనిఖీ

# కురువలు అన్ని రంగాలలో రాణించాలి

- ఎంపి గోరంట్ల మాధవ్

**ప్రజాశక్తి - ఆలూరు**

మాట్లాడుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్

కురువలు అన్ని రంగాలలో రాణించాలని హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్ అన్నారు. ఆదివారం ఆలూరులో బెల్లగుండు ఆంజనేయస్వామి ఆలయం నందు నిర్వహించిన మదాసి, మదారి కురువల కార్తీక వనభోజన కార్యక్రమం మదాసి,మాదారి కురువ సంఘం రాష్ట్ర గౌరవ మాజీ అధ్యక్షుడు ఎన్ మోహన్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా కురువలు రిజర్వేషన్‌లో మోసపోయారన్నారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా జిఓ 53ని విడుదల చేశారన్నారు. తహశీల్దార్ ఆధ్వర్యంలో విచారించి ఎస్సి సర్టిఫికెట్ ఇవ్వాలని ఆదేశించడం జరిగిందన్నారు. అంతకుముందు చెక్ పోస్ట్ నుండి బీరప్ప డోలతో, గోరువయ్యల నృత్యాలతో కురువ పెద్దలకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, వైస్ చైర్మెన్ బుజ్జమ్మ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు దేవేంద్రప్ప, జయరాములు, శ్రీనివాసులు, కృష్ణ మోహన్, జడ్పీటీసీ లింగప్ప, మనేకుర్తి రాజశేఖర్, పంచాలిగాల నాగరాజు, ఆయుస్మాన్ హాస్పిటల్ నాగరాజు, బిసి సంఘం మద్దిలేటి, గిరి, ఎంపీటీసీలు, సర్పంచు లు, మదాసి కురువ సంఘం నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు : రైతు సంఘం

**ప్రజాశక్తి- ఆదోని రూరల్**

రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో ఒప్పంద ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేద్దామని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఒప్పంద ఉద్యోగుల సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రత్నం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒప్పంద ఉద్యోగులు మృతి చెందితే వారి కుటుంబంలో కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలన్నారు. సహజ మరణానికి రూ.5లక్షలు, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలో విజయవాడలో రాష్ట్ర సభను నిర్వహించి తమ డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతామన్నారు. అనంతరం కర్నూలు, నంద్యాల ఒప్పంద ఉద్యోగుల జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ ఇంజినీర్ సుబ్బారెడ్డి, మార్కెట్‌యార్డు కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరాములు, దేవసహాయం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

చెక్కులను అందజేస్తున్న ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి

నియోజకవర్గంలో సీఎం సహాయనిధి కింద రూ. 5,20,000 లక్షల చెక్కులు మంజూరైనట్లు నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే స్వగృహం నందు లబ్ధిదారులకు చెక్కులను నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ ఆహ్మద్, మైనార్టీ నాయకులు రియాజ్ ఆహ్మద్, పట్టణ ప్రధాన కార్యదర్శి యూకె. వీరేంద్ర, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకె. రాజశేఖర్, ముగతి విరుపక్షి రెడ్డి, షేక్షవలి, కౌన్సిలర్ శివ ప్రసాద్, బంగి శ్రీరామ్, కౌన్సిలర్లు, ఇన్ చార్జ్ లు తదితరులు పాల్గొన్నారు.

## యాదవులకు చట్టసభల్లో అవకాశం ఇవ్వాలి

**ప్రజాశక్తి - ఆదోని**

వచ్చే ఎన్నికల్లో చట్టసభలకు ప్రాతినిధ్యం వహించే విధంగా యాదవులకు అవకాశం కల్పించేలా రాజకీయ పార్టీలు చొరవ చూపాలని యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు వంశీ చైతన్య, నర్సింగ్ హోమ్ ప్రొపెరేటర్ రమేష్ యాదవ్, ఊసేనప్ప యాదవ్‌లు కోరారు. ఆదివారం ఆదోని పట్టణంలోని హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన యాదవులు రాష్ట్రంలో సింహ బాగామే ఉన్నామన్నారు. బీసీలు అంటేనే రెండు సామాజిక వర్గాల మాత్రమే పార్టీలకు గుర్తొస్తున్నాయన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే పోటీ చేసి గెలిచే సామర్థ్యం యాదవులకు కూడా ఉందన్నా సంగతి రాజకీయ పార్టీలు గ్రహించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ ,ఎమ్మెల్యే, నామినేటెడ్ పదవులు కేటాయింపులకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీలకే తమ సపోర్టు ఉంటుందని స్పష్టం చేశారు. యాదవుల సమస్యల తెలుసుకునేందుకు ఈనెల 22న బైపాస్ రోడ్‌లోని కాళీ ప్రదేశంలో ఆత్మీయ సమ్మేళనం ఉంటుందన్నారు. కార్యక్రమానికి సినీ హీరో నిఖిల్, కరాటే కళ్యాణి యాదవ్ ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. సమావేశానికి యాదవులు పెద్ద ఎత్తున కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరారు. సమావేశంలో నాయకులు ఈరన్న యాదవ్, చిన్న రంగన్న ,మహేష్, వీరేష్, బాలు వీరారెడ్డి ఉన్నారు.

# అధికారులు మొండి వైఖరి విడనాడాలి

**కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ**

**ప్రజాశక్తి - ఆదోని**

సమావేశంలో మాట్లాడిన రాధాకృష్ణ

సమాజంలో నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో అంటరానితనానికి గురవుతూ, పట్టణ ప్రాంతాలలో సమస్యల వలయంలో చిక్కుకుంటున్న దళితుల సమస్యలపై పాలకవర్గాలు స్పందించాలని, అధికారులు కూడా దళితుల సమస్యల పరిష్కారం పట్ల తమ మొండి వైఖరి విడనాడాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోని పట్టణంలోని ఎన్జీవోస్ హాల్ నందు (భావన హాస్పిటల్ ఎదురుగా) కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లాలో నవంబర్ 28, 29న నిర్వహించబోయే రాష్ట్ర 4వ మహాసభల జయప్రదం చేయాలని కోరుతూ దళితుల సమస్యలు – పాలకవర్గాల, అధికారుల వైఖరి అనే అంశంపై ఆదివారం సదస్సును నిర్వహించారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి బి తిక్కప్ప అధ్యక్షతన జరిగిన సదస్సును ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ గోపాల్ మాట్లాడారు.

పట్టణ, మండల అధికారులు దళితుల సమస్యల పట్ల నిర్లక్ష్యం విడనాడాలని, అనేక గ్రామాలలో సిసి రోడ్లు, మురుగు కాల్వలు లేక మంచి నీటి సమస్యలతో, చివరికి మహిళలకు మరుగుదొడ్లు కూడా లేక అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అయినా పాలకవర్గాల జోక్యం గాని, అధికారుల స్పందన గాని ఏ మాత్రం ఉండడం లేదన్నారు. ఇప్పటికే కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆదోని మండలం లోని గ్రామాలైన కుప్పగల్, నాగనాతనహళ్లి, సంతేకూడ్లురు గ్రామాల్లో అంటరానితనంపైన, స్మశాన సమస్యలపైన మిగిలిన గ్రామాలు, పట్టణంలోని వార్డుల్లో స్థానిక సమస్యలపై పోరాటాలు నిర్వహించామన్నారు. ఇప్పటికే సంతేకూడ్లురు గ్రామంలో ఆర్డిటి కాలనీలో దళితులు నిర్మించుకుంటున్న ఇండ్లకు విధ్యుత్ సౌకర్యం ఇవ్వకుండా అధికారులే వివక్ష చూపిస్తున్నారన్నారు. ఆ కాలానికి కరెంటు లేక నీళ్లు వసతి లేక ఇళ్ల నిర్మానాలను మధ్యలోనే నిలిపేశారన్నారు. సమస్యలపై స్పందించని పాలకవర్గాల విధానాలు, అధికారుల వైఖరిపై మరింత లోతుగా చర్చించి ఉద్యమించేందుకే కెవిపియస్ రాష్ట్ర మహాసభలను నవంబర్ 28, 29న కర్నూలులో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మొదటి రోజు వేలాది మందితో జరిగే ప్రదర్శన, బహిరంగ సభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సదస్సును ఉద్దేశించి కెవిపియస్ జిల్లా కమిటీ సభ్యులు మునిస్వామి, నాగేంద్ర, యువరాజు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సిద్ధప్ప, తాయన్న, పరమేష్, వినోద్, చిన్న మునిస్వామి, నాగేంద్ర, కృష్ణమూర్తి, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**ప్రజాశక్తి - ఆస్పరి**

అప్పుల బాధతో కరువ సురేష్ (26) అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకున్న ఘటన కారుమంచి గ్రామం లో చోటు చేసుకుంది. ఎస్ఐ వరప్రసాద్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కారుమంచి గ్రామానికి చెందిన రైతు కరువ సురేష్ తన 4.50 ఎకరాల్లో రూ.5 లక్షలు అప్పు చేసి బోరు కింద మొదట పత్తి పంట సాగు చేశాడు. అనుకున్నతగా పంట రాక పోవడంతో పత్తి పంట దున్ని ఉల్లి పంట సాగు చేశారు. 150 బస్తాలు ఉల్లి పండింది. మార్కెట్‌లో అమ్మగా క్వింటాం కేవలం రూ.600 లకు పోయింది. పొలంలో మల్లి చౌలకాయ (మట్టికాయలు) విత్తగా గిట్టుబాటు ధర లేక పెట్టిన్న పెట్టుబడి, ఆటో బడుగు,కూలీలు కూడా రాలేదు. దీంతో మనస్తాపం చెందిన సురేష్ శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతునికి భార్య వీరేషమ్మ, ఇద్దరు కుమారైలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# నష్టపోయిన రైతు కుటుంబానికి న్యాయం చేయాలి

- రైతు సంఘం డిమాండ్

**ప్రజాశక్తి - నందవరం**

నాగలాదిన్నె బ్రిడ్జ్ దగ్గర మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నాగలదిన్నె గ్రామం దగ్గర బ్రిడ్జి నిర్మాణంలో భూమి కోల్పోయిన నాగలదిన్నె గ్రామానికి చెందిన సన్నకారు రైతు రోషన్ జమీర్ కుటుంబానికి న్యాయమైన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం నాగలదిన్నె గ్రామంలో రైతు సంఘం ప్రతినిధి బృందం జి.రామకృష్ణతో పాటు జిల్లా సహాయ కార్యదర్శి సి. హనుమంతు జిల్లా నాయకులు దేవపుత్ర, కెవిపిఎస్ నాయకులు రాజు, నాగప్ప చేనేత సంఘం నాయకులు ఎల్లేష్, శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వామి దాసు, టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొని మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి సి. హనుమంతు మాట్లాడుతూ రోషన్, జమీర్ కుటుంబం 7 మంది అన్నదమ్ములు ఉన్నారని, వారు సన్నా చిన్న కారు రైతులని, వారికి సర్వేనెంబర్ 95, 96 లో 1995 సంవత్సరంలో రెండు ఎకరంలో 8 సెంట్ల భూమిని తీసుకొని, నాడు ప్రభుత్వం తుంగభద్ర నది పైన తెలంగాణ రాష్ట్రం పోవడానికి బ్రిడ్జి నిర్మాణం చేశారన్నారు. ఆనాటి అధికారులు బ్రిడ్జి నిర్మాణం కోసం భూమి కోల్పోయిన రోషన్ జమీర్ కుటుంబానికి భూమికి భూమి బదులు ఇస్తామని, అదే విధంగా వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారని, హామీ హామీగానే మిగిలిపోయింది తప్ప భూమికి భూమి రాలేదు ఇంట్లో ఉద్యోగం రాలేదన్నారు. ఇప్పటికైనా రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని, బ్రిడ్జి పైన కాంట్రాక్టర్ చేస్తున్న పనులను రోషన్ శామీర్ కుటుంబంతో పాటు రైతు సంఘం నాయకులు కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు టిడిపి నాయకులు అందరూ వచ్చి మద్దతు పలికి నిరసన తెలియజేశారు. ఇప్పటికైనా రోషన్ జమీర్ కుటుంబానికి న్యాయమైన నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని లేనిపక్షంలో బ్రిడ్జి పనులను శాశ్వతంగా ఆపివేస్తామని హెచ్చరించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని రైతుకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు కలెక్టరేట్ ముట్టడి

- బిసిలు పాల్గొని విజయవంతం చేయాలి : గుడిసె శివన్న

**ప్రజాశక్తి - ఆదోని**

అగ్రవర్ణాలకు కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిసె శివన్న తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు 27 శాతం రిజర్వేషన్ ఉంటే.. కేవలం 15 శాతం ఉన్న అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించడం తగదన్నారు. వారిలో బడా భూస్వాములు, కుబేరులు ఐదు శాతం ఉన్నారని తెలుస్తోందన్నారు. మధ్యతరగతి కుటుంబీకులు 10 శాతం ఉన్నారన్నారు. మరి వారికి ఈడబ్ల్యూఎస్ పది శాతం రిజర్వేషన్ కేటాయిస్తే ఈ దేశ భవిష్యత్తు ఒక్కసారి ఆలోచించాలన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కేటాయించమని అప్పుడు ఈ దేశానికి గొప్ప నాయకుడు దొరికాడని ప్రజలందరూ గౌరవిస్తారన్నారు. రిజర్వేషన్లు గాని దేశ ఆర్థిక వ్యవస్థ గాని దేశ భద్రత గాని వీటన్నిటిపై ముడిపడి ఉన్నాయన్నారు. బిసిలందరూ కలిసి కట్టుగా సోమవారం జరగబోయే కర్నూలు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## పాత పెన్షన్ సాధనకు కలిసి రండి : యుటిఎఫ్

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామంటున్న జిపిఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని పాత పెన్షన్ స్కీం కోసం ఉద్యోగులు ఉపాధ్యాయులతో కలిసి పోరాటాలకు సిద్ధం కావాలని ఎమ్మిగనూరు తాలూక ఎన్జీవో కార్యదర్శి వరప్రసాద్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జె.ఎల్లప్ప పేర్కొన్నారు.

ఆదివారం సిపిఎస్ రద్దుకై యుటిఎఫ్ చేపట్టిన దశలవారి పోరాటాలలో భాగంగా సోమప్ప సర్కిల్ నందు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. . ఈకార్యక్రమంలో ఎన్జీవో నాయకులు శివరామిరెడ్డి, ప్రభు, రామ కృష్ణ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు దావీదు, నరసింహులు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యం. నాగరాజు, జిల్లా అడిట్ కమిటీ సభ్యులు కౌలన్న నాయకులు బి.జి.మాదన్న, రాఘవేంద్ర, లక్ష్మన్న, గురుస్వామి, శంకరయ్య, పెద్దారెడ్డి, హాసన్, మల్లికార్జున, భాగ్యరాజు, సుధాకర్, బాబు, నాగేశ్వర రావు, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## స్థాయిని మించి బాబుపై విమర్శలు తగదు

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

**ప్రజాశక్తి - ఆదోని**

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై కొందరు వారి స్థాయిని మించి విమర్శలు చేయడం సరికాదు అని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి మీనాక్షి నాయుడు అన్నారు. ఆదివారం గుండెపోటుతో మరణించిన పార్టీ సీనియర్ నాయకుడు మారెప్ప కుటుంబాన్ని మీనాక్షి నాయుడు ప్రమర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆదోనిలోనే పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో టిడిపి మైనార్టీ సెల్ పార్లమెంటు అధ్యక్షుడు అప్సర్ బాష, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్తాఫ్ హుస్సేన్, పార్లమెంటు టిడిపి కార్యదర్శి బుద్దారెడ్డి, బిసి సెల్ నాయకులు తిమ్మప్ప, రామకృష్ణ, ఎస్సీ సెల్ నాయకులు లక్ష్మీనారాయణ, జయరాం, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు రవి ,రైతు సంఘం నాయకులు శేసిరెడ్డి, అయ్యన్న, లక్ష్మన్న, నాయకులు రంగస్వామి నాయుడు, జగదీష్, బాలాజీ, సుబ్బు,కాశి, ఇంతియాజ్ రెడ్డి, దొడ్డన గెరి శివప్ప,మాధవ్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, వీరేష్, చాగి మల్లికార్జునరెడ్డి, ఐటిడిపి నాయకులు సజ్జత్, షణ్ముఖ, విరుపాక్షి ఉన్నారు.

## జర్నలిస్టుల హక్కుల కోసం సమిష్టిగా పోరాడుదాం

**ప్రజాశక్తి - దేవనకొండ**

జర్నలిస్టుల హక్కుల కోసం సమిష్టిగా పోరాటాలు చేద్దామని ఏపీయుడబ్ల్యూజె జిల్లా కమిటీ సభ్యులు సుంకన్న, స్వరూప్, చంద్ర,రాజేష్ పేర్కొన్నారు. దేవనకొండ నూతన మండల కమిటీని స్థానిక సి.ఎల్.ఆర్.సి భవనంలో జర్నలిస్టులు ఆదివారం ఎన్నుకున్నారు. దేవనకొడ మండల విలేకరుల అధ్యక్షులుగా పురుషోత్తం గౌడ్,ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం గౌరవ సలహాదారులుగా చిన్న ఖాశీం,గౌరవ అధ్యక్షులుగా పెద్ద ఖాశీమ్,,కోశాధికారిగా దస్తగిరి ఉపాధ్యక్షులుగా నాగరాజ్,సోమన్న సహాయ కార్యదర్శులుగా వన్నూరప్ప, శేఖర్ కార్యవర్గ సభ్యులుగా వెంకటేష్ వెంకటేశ్వర్లను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని జిల్లా కమిటీ సభ్యులు పూలమాల,శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆస్పరి నాగన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

## ప్రజలపై భారాలు సరికాదు : సిపిఎం

**ప్రజాశక్తి - హోళగుంద**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై లేనిపోని భారాలు మోపడం సరికాదని సిపిఎం మండల కార్యదర్శి లింగంపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎనిమిదేళ్ల కాలంలో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజల కోసం ఏ ఒక్క మంచి పని కూడా చేయలేదని అన్నారు. అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేటర్లకు ఉన్నదంతా దోచ పెడుతూ బిజెపి ప్రజలను కష్టాల్లోకి నెట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితి చూస్తుంటే రోడ్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించుకుండా సంక్షేమ పథకాలు అంటూ ప్రజలపై లేనిపోని భారాలు మోపుతోందన్నారు. ప్రజలపై కరెంట్, బస్ ఛార్జీలు పెంచడమే కాకుండా చెత్త పనులు కూడా చెల్లించమని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీల యూనియన్ నాయకులు, వెంకటేష్, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను యువత ఉపయోగించుకోవాలి : జడ్పీటీసీ

**ఆస్పరి**: యువతి, యువకులు గ్రంథాలయలను ఉపయోగించుకోవాలని జడ్పీటీసీ దొరబాబు అన్నారు.ఆదివారం ముగింపు కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన,వకత్వ, క్విజ్ పోటీల్లో విజేతలకు జిల్లా కెడిసిసి డైరెక్టర్ రాఘవేంద్ర, జడ్పీటీసీ దొరబాబు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,నోబెల్ స్కూల్ ఉపాధ్యాయులు నరేంద్ర, రామాంజనేయులు,రామకృష్ణ ల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు.

## 28న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**ఎమ్మిగనూరు** : ఈనెల 28 నుండి ఎమ్మిగనూరు జాతరను పురస్కరించుకుని రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నట్లు వైయస్సార్సీపి సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే స్వగృహం నందు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి వై.యస్.ఆర్ అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ గోడ పత్రికలను కరపత్రాలను ఆవిష్కరించారు.మున్సిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ ఆహ్మద్, మైనార్టీ నాయకులు రియాజ్ ఆహ్మద్, పట్టణ ప్రధాన కార్యదర్శి యూకె. వీరేంద్ర, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకె. రాజశేఖర్, ముగతి విరుపక్షి రెడ్డి, షేక్షవలి, కౌన్సిలర్ శివ ప్రసాద్, బంగి శ్రీరామ్ పాల్గొన్నారు.

## రాజగోపురం నిర్మాణానికి విరాళం

**ప్రజాశక్తి - కౌతాళం**

విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీ నరసింహ ఉరు కుంద ఈరన్న స్వామి రాజ గోపురం నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం ఇచ్చినట్లు దేవాలయ సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చెందిన గుంతకల్లు పట్టణానికి చెందిన నాగేశ్వరరావు లలిత భాయ్ కుటుంబ సభ్యులు విరాళం ఇవ్వడం జరిగిందన్నారు. పుణ్యక్షేత్రంలో రాజగోపురం నిర్మాణంతో పాటు నిత్య అన్నదానం అనేక అభివృద్ధి పనులు జరుగుతు న్నాయన్నారు. భక్తులు విరాళాలు అందించి అభివృద్ధిలో పాలుపంచుకోవా లని కోరారు. దాతల పేరున దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శేష వస్త్రాలతో పాటు లడ్డు ప్రసాదాలను అందజేశారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

## అర్చకుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- వైసిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి

**ప్రజాశక్తి - మంత్రాలయం**

కర్నూలు జిల్లాలోని అర్చకుల సమస్యల పరిష్కారాలపై దృష్టి సారించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలోని స్వగృహంలో అర్చక సమాఖ్య ప్రతినిధులుగా ఎంపికైన మంత్రాలయం సూర్యనారాయణాచార్యులు ఎమ్మెల్యేని మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి పూల మాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని దేవాలయాల సమస్యల్ని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తన వంతు ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్యకు పూలమాల వేసి, శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు భీమయ్య ఆచార్యులు, రమణయ్య, విజయమోహన్ ఆచార్యులు, మధుసూదన్ ఆచార్యులు, సత్యనారాయణ, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారి ప్రమాదాల నివారణకు కృషి : డిఎస్‌పి

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

రహదారి ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ప్రపంచ వ్యాప్తంగా 5 కోట్ల రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయని ఇందులో సుమారు 5 లక్షల మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు క్షతగాత్రులుగా మిగులుతున్నారని తెలిపారు. ప్రధానంగా 20 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న వారే అధికంగా ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. రహదారి నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డా.గోపీనాథ్, పట్టణ సీఐలు విక్రమసింహా, చంద్రబాబు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యం పట్ల అప్రమత్తత అవసరం

**ఆదిత్య నర్సింగ్ హోమ్ డాక్టర్ ఆదిత్య కుమార్**

**ప్రజాశక్తి - ఆదోని**

వివరాలు వెల్లడించిన డాక్టర్ ఆదిత్య కుమార్

చలి తీవ్రత రోజు పెరుగుతుందని ఈ నేపథ్యంలో చిన్నారులకు శ్వాసకు సంబంధించిన జబ్బులు సోకే అవకాశం ఉందని తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదిత్య నర్సింగ్ హోమ్ డాక్టర్ ఆదిత్య కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. చలి కాలంలో దోమల వృద్ధి అధికంగా ఉంటుందని, వాటి కాటు వల్ల సీజనల్ జ్వరాలు సోకుతాయన్నారు. డెంగ్యూ, మలేరియా, మెదడు వాపు వంటి ప్రమాదకరమైన జ్వరాలు దోమమ కాటువల్లనే సంభవిస్తాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి తొట్టలు, మురుగు కాలువలు, కొబ్బరి బోండాలు ,పూల కుండీలు, ఎయిర్ కూలర్ ,పాత టైర్లల్లో నిలిచిన నీటిలో దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయ న్నారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపుతు, జాగ్రత్తలు పాటించాలన్నారు. వేడి చేసిన నీటినే తాగించాలన్నారు. అవగాహన లోపం వల్ల ఇప్పటికే చిన్నారుల ఆరోగ్యం పట్ల సొంత వైద్యం అనుభవము లేని డాక్టర్‌ను సంప్రదించి వ్యాధి తీవ్రత పెంచుతున్నారన్నా రు. నిర్లక్ష్యం చేయడం వల్ల పిల్లల ప్రాణాలకు ముప్పి వాటిల్లే ప్రమాదం ఉంటుందన్నారు. మెరుగైన చికిత్స అందిస్తే ప్రాణాప్రాయం నుండి కాపాడవచ్చాన్నారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల జ్వరం తీవ్రత తట్టుకోలేక అపస్మారక స్థితిలోకి జారుకునే అవకాశము ఉంటుందన్నారు. స్పెషలిస్ట్ లను సంప్రదించి మెరుగైన చికిత్సతో పిల్లల ఆరోగ్యం మెరుగు పరచుకోవాలసిన అవసరం ఉందన్నారు. తమ ఆసుపత్రిలో అన్ని రకములైన వ్యాధులకు చికిత్స అందిస్తూ,అన్ని పరీక్షల ల్యాబ్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. అదే విధంగా టీకాలు ,వాక్సినేషన్ సదుపాయము ఉందన్నారు. క్రిటికల్ రోగాల బారిన పడ్డ వారికి ఇసియు,వెంటిలేటర్ సౌకర్యం ఉందన్నారు. తమ సేవలను చుట్టుపక్క ప్రాంతాలవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ఎమ్మిగనూరు అభివృద్ధి ప్రదాత బివినే : టిడిపి

**ప్రజాశక్తి - నందవరం**

మాట్లాడుతున్న టిడిపి నేతలు

ఉమ్మడి ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత దివంగత మాజీ మంత్రి బివి మోహన్ రెడ్డినేనని టిడిపి సీనియర్ నాయకులు మాధవరావు దేశాయ్, ఈరన్నగౌడ్, రఘుమూర్తి స్వామి,కాశీంవలి, నారాయణ రెడ్డిలు అన్నారు. ఆదివారం నందవరంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎమ్మిగనూరు పర్యటన విజయవంతం చేసిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు పర్యటనతో జన సునామీని చూసిన వైసీపీ నాయకులు పిచ్చి వేషాలు వేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ప్రజలకు వైసీపీ ప్రభుత్వం చేసిన అవినీతి, మోసాలను చంద్రబాబు పర్యటనలో వివరిస్తే స్థానిక వైసీపీ వారికి భయం ఎందుకని వారు ప్రశ్నించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ రావాలని సవాల్ విసిరారు. తాగు, సాగు నీరు అందించిన ఘనత బివి కుటుంబానికి దక్కిందని, ప్రతి గ్రామానికి రోడ్లు, అన్ని ఊర్లో సిసి రోడ్లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేసింది బివి కుటుంబం అని అన్నారు. వాల్మీకుల సమస్యల పై మాట్లాడని మంత్రి జయరాం వాల్మీకి సమస్యలు పై నోరు విప్పిన మంత్రి చంద్రబాబు పై విమర్శలు చేసేందుకు నోరు తెరచి మాట్లాడం సిగ్గు చేటు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దావీదు, రామకృష్ణ రెడ్డి, లచ్చప్ప, తిప్పరెడ్డి, గోపాల్, నరసప్ప, మిట్టా సోమాపురం వీరేష్, బాలరాజు, తిమ్మప్ప, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పగల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును సిపిఎం బృందం పరిశీలన

**ప్రజాశక్తి - ఆదోని రూరల్**

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

మండలం పరిధిలో కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకును సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.వెంకటేశులు, మండల కార్యదర్శి కే. లింగన్న, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి.వీరారెడ్డి, మండల కమిటీ సభ్యులు శేఖర్ రామాంజనేయులు ఆదివారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుప్పగల్లు ఫారెస్ట్ సమీపంలో నిర్మించిన కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకు ద్వారా కుప్పగల్, బల్లెకల్, పాండవగల్, గనేకల్, జాలమంచి,ఇస్వి, గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది కానీ ప్రస్తుతం ఈ 10 రోజుల కాలంలోనే మూడుసార్లు మోటార్ చెడిపోయిందన్నారు. మోటార్ రిపేరు పేరుతో ఈ ఆరు గ్రామాల ప్రజలకు తాగునీరు సక్రమంగా అందడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం అదనంగా కొత్త మోటార్‌ను ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. మైక్రో ఫిల్టర్ స్థానంలో కొత్త ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని 15 రోజుల్లోగా సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ పర్యటనలో గనేకల్లు,శాఖ కార్యదర్శి విరుపాక్షి,కుప్పగల్ సిపిఎం సభ్యులు హుసేని,రమేష్,పాండవగల్ గ్రామ పార్టీ సభ్యులు చిన్న తాయన్న,యు. హనుమంత రెడ్డి,హనుమంత రెడ్డి,బల్లెకల్ ఆటో యూనియన్ నాయకులు వీరేష్,ఉరుకుందు, తాయప్ప, డివైఎఫ్ఐ నాయకులు వీరేష,హుసేని, యువరాజు, ఆయా గ్రామాల నుండి అంజనేయ పాల్గొన్నారు.

# దేవాలయ నిర్మాణానికి జెడ్పిటిసి విరాళం

**ప్రజాశక్తి - చిప్పగిరి**

జెడ్పిటిసి వీరుపాక్షిని సన్మానిస్తున్న దృశ్యం

నియోజకవర్గమైన ఆలూరులో నూతనంగా నిర్మిస్తున్న బెలగొండ ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణమునకు ఆదివారం దేవాలయ కమిటీ పెద్దలకు చిప్పగిరి జెడ్పిటిసి విరుపాక్షి లక్ష 11 వేల రూపాయలు విరాళముగా అందజేశారు. విరుపాక్షి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడానికి తను వంతుగా సహాయ సహకారం అందిస్తామన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల ప్రతి ఒక్కరికి కూడా దైవ భక్తి ఏర్పడుతుందన్నారు. ప్రతి మనిషిలోనూ ఏదో ఒక గొప్పతనం ఉంటుందన్నారు. మనకు దాన్ని చూసే గొప్ప మనసు ఆ దేవుడు మనకు కరుణించాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు విరుపాక్షి గారిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ వైసీపీ కన్వీనర్ ఓబులేసు వైసిపి నాయకులు నాగప్ప, పెద్దయ్య పాల్గొన్నారు.

## పీఎం ఆవాస్ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

**ప్రజాశక్తి - కౌతాళం**

కౌతాళం : భూమి పూజ చేస్తున్న సర్పంచి పాల్ దినకరన్

పిఎం ఆవాస్ ఇళ్ల నిర్మాణానికి కౌతాళం సర్పంచ్ పాల్ దినకరన్ ఆదివారం భూమి పూజ చేశారు. పాల్ దినకరన్ మాట్లాడుతూ మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి సహకారంతో మండల కేంద్రానికి 17 ఇండ్లు మంజూరు కావడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రెండు లక్షల పదివేల రూపాయలు లబ్ధిదారులకు అందించడం జరుగుతుందన్నారు. మండల నాయకులు స్వర్గీయ దేశాయ్ కృష్ణ ఆశయాలను నెరవేర్చడానికి గ్రామ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ జ్యోతి, మాజీ సర్పంచ్ అవతారం, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, చౌదరి బసవరాజ్, వడ్డే రాముడు, అబ్దుల్ సమద్, రామకృష్ణ, వహీద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

**పెద్దకడబూరు** : ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణానికి గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ మండల కన్వీనర్రామోహన్ రెడ్డి మాట్లాడుతూ మండలానికి 87 పక్క గృహాలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇందులో ఇప్పటికే 16ఇళ్ల నిర్మాణాలు మొదలై వివిధ దశలో ఉన్నాయని తెలిపారు. లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రెండు లక్షలు బిల్లు రూపంలో అందజేస్తామని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బ్రహ్మయ్య చారి, మొట్టు ఈరన్న, వర్క్ ఇన్స్పెక్టర్లు నాగన్న, మాధవి లత తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారు : వైసిపి

**ప్రజాశక్తి - చిప్పగిరి**

టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ, వైసీపీ సీనియర్ నాయకులు ఏరూరు రంగస్వామి అన్నారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు రాజధానికి మద్దతు ఇవ్వాలని శాంతియుతంగా నిరసన తెలిపిన లాయర్లకు అసభ్య పదజాలంతో దూషించడం మంచిది కాదన్నారు. వైసిపి నాయకులు శ్రీధర్, రాజన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.

# చిరు వ్యాపారుల పొట్ట కొట్టొద్దు

**- జీవనోపాధికి ప్రత్యామ్నాయం చూపండి : సిపిఎం**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాల పట్టణంలో రోడ్ల వెడల్పు ఫుట్ పాత్‌లపై ఆక్రమణల తొలగింపు పేరుతో చిరు వ్యాపారులకు సమయం ఇవ్వకుండా బంకులు, టీ కొట్లు తొలగించడం సరైన పద్ధతి కాదని, వారి జీవనోపాధిపై దెబ్బ వేయడం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్న వ్యాపారస్తులు రోడ్లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారని, అలాంటి వారి జీవనోపాధి దెబ్బతీయడం సబాబు కాదన్నారు. చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే చిన్న వ్యాపారస్తుల నుంచి మున్సిపాలిటీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల రూపాయల ఆదాయం వస్తుందన్న విషయాన్ని మున్సిపాలిటీ అధికారులు గమనించాలన్నారు. ఇప్పటికే చిరు వ్యాపారస్తుల నుంచి మున్సిపాలిటీపై, ఎమ్మెల్యేపై వ్యతిరేకత వస్తుందని, ఈ విషయాన్నీ అధికారులు గమనించాలన్నారు. సిపిఎం అభివృద్ధిని కోరుకుంటుందని, నంద్యాల పట్టణ అభివృద్ధికి వ్యతిరేకం కాదని, అలా అని పేదలకు అన్యాయం చేస్తామంటే ఊరుకోమని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయం చూపి సమయం ఇచ్చి తొలగించి ఉంటే బాగుండేదని అన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నుండి చిరు వ్యాపారస్తులకు తోపుడుబండ్లు ఇచ్చి వారి వ్యాపారాలకు శిల్పా సహకార బ్యాంకు నుండి రుణాలు ఇస్తున్నారని, కాబట్టి ఒక పక్క చిరు వ్యాపారస్తులకు రుణాలు ఇచ్చి ఆదుకుంటామని అంటూ, మరోపక్క వారి జీవనోపాధిని దెబ్బ కొట్టడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కావున చిరు వ్యాపారస్తులకు ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలని కోరారు. అలాగే నంద్యాల డెవలప్మెంట్‌లో భాగంగా జిల్లా అయింది కాబట్టి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బంగారం అంగండ్ల వీధిలో రోడ్ల విస్తరణ చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, కార్యదర్శివర్గ సభ్యులు డి.లక్ష్మణ్, సీనియర్ నాయకులు తోట మద్దులు తదితరులు పాల్గొన్నారు.

# న్యుమోనియాపై విస్తృత అవగాహన

**- పిల్లలను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు**
**- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఒ.ప్రభావతి**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

**'న్యుమోనియా అనేది ఐదు సంవత్సరాలలోపు పిల్లలలో వస్తుంది. దేశంలో న్యుమోనియా వలన పిల్లలు 16 శాతం మరణించారు. మరణాలు తగ్గడానికి కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నవంబర్ 12 నుండి వచ్చే ఏడాది 2023 ఫిబ్రవరి నెల వరకు దాదాపు 4 నెలలు సాన్స్ ప్రోగ్రాం పేరుతో అవగాహన కార్యక్రమాలు చేపడుతుంది. న్యుమోనియా వలన పిల్లలలో ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది కాబట్టి న్యుమోనియా వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి నివారణకు చికిత్స, సలహాలు తీసుకోవాలి' అని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఒ.ప్రభావతి తెలిపారు. న్యుమోనియా వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇతర విషయాలపై డాక్టర్ ఒ.ప్రభావతి ప్రజాశక్తితో ముఖాముఖి వెల్లడించారు. ఆమె మాటల్లోనే..**

**న్యుమోనియా వ్యాధి అంటే ఏమి..?**

**జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి :** న్యుమోనియా అనే వ్యాధి ఊపిరితిత్తులలో అసాధారణ ద్రవం చేరడం వలన వస్తుంది. శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిని కలిగించే పరిస్థితి ఉంటుంది. దీనిని ఊపిరితిత్తులలో నెమ్ము చేరడం అని కూడా అంటారు.

**న్యుమోనియా వ్యాధి వ్యాప్తి విధానం వివరించగలరు..?**

**జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి :** మనం శ్వాస తీసుకుంటున్నపుడు గాలితో పాటుగా న్యుమోనియా వ్యాధి కారకక్రిములు (వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్) ఒకరి నుండి మరొకరికి చేరి ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ కలుగజేస్తుంది.

**న్యుమోనియా వ్యాధి ఎవరికి ఎక్కువగా సంక్రమిస్తుంది..?**

**జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి :** 5 సంవత్సరాల లోపు పిల్లలకు, పోషకాహార లోపం కలిగిన పిల్లలకు, 60 సంవత్సరాలు పైబడిన వారికి ఈ వ్యాధి ఎక్కువగా సంక్రమిస్తుంది.

**న్యుమోనియా వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి..?**

**జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి :** దగ్గు, జ్వరం, ఛాతి నొప్పి, గల్ల పడడం, చర్మం నీలి రంగులోనికి మారడం, బరువు తగ్గడం న్యుమోనియా వ్యాధిలో ప్రమాదకర లక్షణాలు. పిల్లలు శ్వాస పీల్చడానికి ఇబ్బంది పడడం. మగతగా ఉండడం. డొక్కలు ఎగవేయడం. ఛాతి ఎముకల కింది భాగాన గుంతలు పడడం, ముక్కు పుటాలు ఎగవేయడం వంటి లక్షణాలు కనపడతాయి..

**న్యుమోనియా వ్యాధి నివారణ మార్గాలు ఎలా..?**

**జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి :** 6 నెలల వరకు తల్లి పాలు మాత్రమే పట్టాలి. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు నోటికి రుమాలు అడ్డు పెట్టుకోవాలి. వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. చిన్న పిల్లలను వెచ్చగా ఉంచాలి. చేతులు తరచుగా నీటితో శుభ్రం చేసుకోవాలి. అనుబంధ పోషకాహారం ఇవ్వాలి. తప్పకుండా విటమిన్ ఎ ద్రావణం ఇవ్వాలి. జన సమర్ధ ప్రదేశాలకు పిల్లలను తీసుకుపోరాదు. యాంటి బయోటిక్స్ (అమాక్సిసిలిన్) మందులు వాడాలి. వాయు కాలుష్య నివారణ ద్వారా వ్యాధి రాకుండా జాగ్రత్త పడవచ్చు.

**ఈ వ్యాధి ఏ సీజన్లో పిల్లలలో ప్రబలుతుంది..?**

**జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి :** వర్షాకాలం, చలికాలంలో పిల్లలకు ఎక్కువగా న్యుమోనియా ప్రబలే అవకాశం ఉంటుంది. కాబట్టి తల్లిదండ్రులు ఆ రెండు సీజన్లలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. న్యుమోనియా వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి చికిత్స అందించాలి. పెంటవాలేంట్ వ్యాక్సిన్ తగిన సమయంలో వేయించాలి.

**న్యుమోనియా నుండి పిల్లల మరణాలు తగ్గడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నాయి వివరించగలరు..?**

**జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి :** న్యుమోనియా నుండి పిల్లలు మరణించకుండా ఉండడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సాన్స్ అనే ప్రోగ్రామ్‌ను అమలు చేస్తుంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తారు.

**సాన్స్ ప్రోగ్రాం జిల్లాలో అమలవుతుందా ?**

**జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి :** కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నవంబర్ 12వ తేదీ నుండి వచ్చే ఏడాది 2023 ఫిబ్రవరి వరకు కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. జిల్లాలో, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి న్యుమోనియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. న్యుమోనియా వచ్చిన పిల్లలను గుర్తించి వారికి అవసరమైన చికిత్సలు కూడా అందిస్తున్నాం.

**జిల్లాలో పిల్లలకు ఇచ్చే మిగతా వ్యాక్సినేషన్ పరిస్థితి ఏమిటి..?**

**జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి :** జిల్లాలో వ్యాధి నిరోధక టీకాలు పిల్లలకు అందుబాటులో ఉన్నాయి. పుట్టిన ప్రతి బిడ్డకు నెలవారి టీకాలు అందిస్తున్నాం. జిల్లాలో పిల్లలకు వారి వయసుకు తగ్గట్టు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నాం.

**జిల్లాలో రెగ్యులర్ వ్యాక్సినేషన్ ఎంత శాతం పూర్తి చేశారు..?**

**జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి :** జిల్లాలో రెగ్యులర్ వ్యాధి నిరోధక టీకాలు 85 శాతం పైగా పూర్తి చేశాం.

**కరోనా వ్యాక్సినేషన్ జిల్లాలో ఎంతమందికి ఇచ్చారు..?**

**జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి :** కరోనా వ్యాక్సినేషన్ 12 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలకు 100 శాతం ఇచ్చాం.. 60 ఏళ్లు పైబడిన వారికి 95 శాతం, ఫ్రంట్ లైన్ వారియర్స్, హెల్త్ వర్కర్లకు, 18 నుండి 59 సంవత్సరాల వారికి మొదటి రెండు డోసులు 100 శాతం పూర్తి చేశాం.

# ఫలించిన పోరాటం

**- నెల వేతనాలు క్లాప్ డ్రైవర్ల ఖాతాలో..**
**- సిఐటియుకు అభినందనలు**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాల మున్సిపల్ క్లాప్ ఆటో డ్రైవర్లు పెండింగ్ వేతనాల కోసం సిఐటియు ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా చేపట్టిన పోరాటం ఫలించింది. రెండు నెలల పెండింగ్ వేతనాలకు గాను ఒక నెల వేతనం డ్రైవర్ల ఖాతాల్లో వేశారు. మరో నెల వేతనం వారం రోజుల్లో వేస్తామని ఏజెన్సీ హామీనిచ్చింది. దీంతో క్లాప్ ఆటో డ్రైవర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమకు అండగా నిలబడిన సిఐటియు నాయకులకు క్లాప్ ఆటో డ్రైవర్లు అభినందనలు తెలియజేశారు.

# వారపు సంతలో సౌకర్యాలు శూన్యం

రోడ్డుపైనే సంత జరుగుతుండడంతో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

**ప్రజాశక్తి - సంజామల**

మండలంలోని నొస్సం, పేరుసోమల, సంజామల గ్రామాల్లో ప్రతి ఆదివారం జరిగే సంతల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. సంజామలలో వారం వారం జరిగే ఈ సంతకు కానాల, గిద్దలూరు, మంగపల్లి, యగ్గోని, ముచ్చలపురి, కొత్తపేట, గుల్లదుర్తి, కొత్తపల్లి తదితర గ్రామాల నుంచి ప్రజలు వ్యాపారం నిమిత్తం వస్తుంటారు. సంతలో ఎక్కువగా కూరగాయలు, నిత్యావసర వస్తువులు, పండ్లు క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. పేరుకు మాత్రం పెద్ద సంత అయినప్పటికీ సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులు చాలా తక్కువగా సంతకు వస్తారు. ఈ సంత మార్కెట్‌ను బస్సులు వెళ్లే రోడ్డు మీదనే నిర్వహించడం వలన వ్యాపారులకు అడుగడుగునా సమస్యలు ఎదురవుతున్నాయి. మార్కెట్లో నిలవడానికి నీడ లేదు. వేసవి మండుటెండల్లో, వర్షాకాలం వర్షంలో సంతను ఆరుబయట రోడ్డుమీద నిర్వహించు కోవాల్సిన పరిస్థితి ఉంది. కూరగాయలు ఎండకు ఎండి వానకు తడిసి పాడైపోవడంతో నష్టపోవాల్సి వస్తుందని వ్యాపారులు వాపోతున్నారు. మార్కెట్లో దుమ్ము ధూళి వల్ల పరిశుభ్రత కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఒక్కోసారి సంత పరిస్థితి చూసి వ్యాపారులు వెనుదిరిగి వెళుతుంటారు. సంత మార్కెట్, దిన మార్కెట్ల వల్ల గ్రామ పంచాయతీకి ప్రతి ఏటా వేలాది రూపాయల ఆదాయం వస్తుంది. అయినా సంత మార్కెట్లో ఏ మాత్రం సౌకర్యాలు కల్పించడం లేదు. సంతలో సౌకర్యాలు కల్పిస్తే వ్యాపారం పెరిగి గ్రామపంచాయతీకి మరింత ఆదాయం వస్తుందని గ్రామస్తులు, వ్యాపారులు చెబుతున్నారు.

## నేడు స్పందన కార్యక్రమం

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం నంద్యాల పట్టణంలోని వైఎస్సార్ సెంటినరీ హాలులో స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాధికారులందరూ హాజరుకావాలని తెలిపారు.

**నేడు పోలీసు స్పందన కార్యక్రమం**

**తాత్కలిక రద్దు :** కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో జిల్లా అధికారులు బందోబస్తు డ్యూటీలో ఉన్న సందర్భంగా నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో నేడు పోలీసు స్పందన కార్యక్రమం తాత్కలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక చర్యలు : ఇఒ

**ప్రజాశక్తి - శ్రీశైలం**

మాట్లాడుతున్న ఇఒ లవన్న

శ్రీశైల క్షేత్రంలో పోలీస్ సహకారంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దేవస్థానం కార్య నిర్వహణ అధికారి లవన్న అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, క్రమబద్ధీకరణపై ఆదివారం స్థానిక కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం ధర్మకర్తల మండలి సూచించిన చోట్ల పలు ప్రదేశాలలో అంతర్గత గేట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధాన కూడలిల వద్ద, వలయ రహదారిపై 28 చోట్ల గేట్లను ఏర్పాటు చేశామన్నారు. ఏర్పాటు చేసిన గేట్ల వద్ద దేవస్థానం భద్రత సిబ్బందిని ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని భద్రత అధికారిని ఆదేశించారు. వివిధ సత్రాల మార్గాలకు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాటు చేసిన భద్రత సిబ్బంది డ్రైవర్లకు సూచించాలని అన్నారు. పార్కింగ్ స్థలంలో మాత్రమే వాహనాలు నిలిపేందుకు ప్రసార వ్యవస్థ ద్వారా భక్తులకు తెలియజేస్తూ ఉండాలని సూచించారు. గణేష్ సదన్ వద్ద, యజ్ఞవాటిక, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం, గౌరీ సదన్ ప్రాంతం, దేవస్థానం వైద్యశాల, జిల్లా పరిషత్ భవనం, గంటామఠం వెనక, ఆరుబయలు ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారని, వలయ రహదారిపై పలుచోట్ల సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ప్రయాణీకుల సంతోషమే ఆర్‌టిసి ధ్యేయం

**ప్రజాశక్తి - డోన్**

ప్రయాణీకుల సౌకర్యం, సంతోషమే ఎపిఎస్ఆర్‌టిసి ధ్యేయమని డోన్ డిపో మేనేజర్ శశి భూషణ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎపి రాష్ట్ర ప్రజా రవాణా శాఖ ఆధ్వర్యంలో డోన్ డిపోలో ప్రయాణీకుల సంతోష వారోత్సవాలు ఈ నెల 21 నుండి 27 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణీకులు www.apsrtconline.in వెబ్‌సైట్ ద్వారా ఎపిఎస్ఆర్‌టిసి బస్సులలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా టికెట్లు ముందుగానే ఇంటర్నెట్, మొబైల్, ఎటిబి ఏజెంట్స్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని, అన్ని ఓపిఆర్ఎస్ సర్వీసులలో రిటర్న్ జర్నీ టికెట్స్ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ కలదని తెలిపారు.ఓపిఆర్ఎస్ సర్వీస్ ద్వారా బస్సు ఎక్కడ ఉందో చూసుకోనుటకు ట్రాకింగ్ సదుపాయం ఉందని, బస్సు సర్వీసులపై ఫిర్యాదులు ఏమైనా ఉంటే నెంబర్ 9959225809కు ఫోన్ చేసి తెలపగలరని కోరారు. ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

**ప్రజాశక్తి - రుద్రవరం**

ఆళ్లగడ్డ మండలం బాచ్చాపురం మెట్ట దగ్గర ఉన్న ధన్వంతరి దేవాలయం దగ్గర నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయుర్వేద డాక్టర్ శేషన్న తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ధన్వంతరి జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకు ఆయుర్వేద డాక్టర్ శేషన్న, డాక్టర్,సీతా కళ్యాణి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని అహోబిలం క్షేత్రానికి వెళ్లే భక్తులు, చుట్టుపక్క గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## లోడింగ్ కార్మికుడు ఆకస్మిక మృతి

**బేతంచెర్ల :** బేతంచెర్లలోని లారీ లోడింగ్ హమాలీ వర్కర్స్ యూనియన్ సభ్యుడు గోపాల్ రెడ్డి(44) ఆదివారం ఆకస్మికంగా మరణించారు. గత 15 సంవత్సరాలుగా గోపాల్ రెడ్డి సిఐటియు అనుబంధ సంఘమైన లారీ లోడింగ్ హమాలి వర్కర్‌గా, పని చేస్తున్నారు. గత రెండు రోజులుగా ఆరోగ్యం సరిగా లేని ఆయన ఉదయం తిరుగుతూ మాట్లాడుతుండగానే ఆకస్మికంగా మరణించారు. గోపాల్ రెడ్డికి భార్య ఎల్ల నాగేశ్వరి, కుమారుడు, కూతురు ఉన్నారు. గోపాల్ రెడ్డి మృతి పట్ల ఆ సంఘం నాయకులు రాఘవరెడ్డి, చంద్ర, బడేసా, రాముడు, రామాంజనేయులు తదితరులు ఆ కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

## ఖోఖో జూనియర్ బాలికల జట్టుకు 21 నుండి కోచింగ్ క్యాంప్

**ఆత్మకూరు :** కర్నూలు జిల్లా జూనియర్ ఖోఖో బాలికల జట్టుకు నంద్యాల శ్రీ గురు రాజా హైస్కూల్ వారి ఆధ్వర్యంలో నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 21 నుండి కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు శంకర్, ప్రధాన కార్యదర్శి పి.ప్రభాకర్‌లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు జిల్లా జూనియర్ ఖోఖో జట్టు డిసెంబర్‌లో 9, 10, 11వ తేదీలలో ఆత్మకూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : సిఐటియు

**ప్రజాశక్తి - వెలుగోడు**

కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం కోట్లాదిమంది కార్మికులకు అన్యాయం చేస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసు రత్నం, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని మొత్తం కార్పొరేట్ శక్తులకు అమ్ముతూ దేశాన్ని దివాలా తీస్తుందని విమర్శించారు. రోజురోజుకు పెరిగిన ధరలతో ఉద్యోగులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ధరలను అదుపు చేయడంలో మోడీ విఫలమయ్యారని అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చి ఎనిమిది సంవత్సరాలు పూర్తి అవుతున్నా ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో బిజెపి ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదన్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2022ను వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ శాఖలో సంస్కరణలను నిలిపివేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ స్కీముల్లో పని చేస్తున్న అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన, వివోఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికులకు కనీస వేతనం పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసంఘటితరం కార్మికులకు సమగ్ర వేతన చట్టం తీసుకుని వచ్చి 60 సంవత్సరాలు దాటిన వారికి నెలకు రూ. 5 వేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. మున్సిపల్ వర్కర్లు, గ్రామపంచాయతీ వర్కర్లు, స్వచ్ఛభారత్ కార్మికులకు కనీస వేతనం రూ.18,500 ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు లేకుండా చూడాలని కోరారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా వైసిపి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలన్నారు. విద్యుత్తు రంగంలో పీస్ రేటు విధానాన్ని రద్దుచేసి బిల్ రీడర్స్ని కార్మికులను, రెవెన్యూ క్యాషియర్స్‌కు జీతాలను ఇచ్చి ఆదుకోవాలన్నారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రామదాసు, మహమ్మద్ రఫీ, ఆంజనేయులు, వెంకటయ్య, నాగమోహన్, కృష్ణ, వలి, కిషోర్ పాల్గొన్నారు.

# శ్రీశైలంలో కార్తీక సందడి

**ప్రజాశక్తి - శ్రీశైలం**

కార్తీక మాసం పురస్కరించుకొని చివరి ఆది, సోమవారాలలో శ్రీశైలం క్షేత్రంలో భక్తుల సందడి పెరిగింది. శ్రీశైలం క్షేత్రం అంతా గత నాలుగు రోజుల నుండి భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఉండే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైలం చేరుకొని పాతాళ గంగలో స్నానాలు ఆచరించి తెల్లవారుజాము నుండి స్వామి అమ్మ వాళ్ళని దర్శించుకునేందుకు క్యూలైన్లో వేచి ఉన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి సుప్రభాత సేవ, మహా మంగళహారతి కార్యక్రమాల అనంతరం 4 గంటల నుండి దర్శనం కల్పిస్తున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్నందున ఆర్జిత అభిషేకాలు, గర్భాలయ అభిషేకాలు రద్దు చేశారు. పరిపాలన భవనం సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు కేటాయించారు. క్యూలైన్లో ఉన్న భక్తులకు అల్పాహారం, మంచినీరు ఏర్పాటు చేశారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించుకునేందుకు గంగాధర మండపం ఉత్తరం మాడ వీధి ఏర్పాటు చేశారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఈవో లవన్న ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

శ్రీశైలం క్షేత్రంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

కార్తీక దీపాలను వెలగిస్తున్న భక్తులు

# బిసి హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్‌ను తొలగించాలి

**- రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్**

**ప్రజాశక్తి - సంజామల**

సంజామలలోని బిసి సంక్షేమ హాస్టల్ ఇన్చార్జ్ వార్డెన్ విద్యార్థులకు సరైన మెనూ అమలు చేయకుండా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే ఆయనను విధుల నుండి తొలగించాలని రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బందెల ఓబులేసు, జిల్లా అధ్యక్షులు పూల వెంకట్, తెలుగు రాష్ట్ర స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు ఇండ్ల జయరాజు డిమాండ్ చేశారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థులు ఏదైనా అడిగితే పెట్టింది తినాలని గట్టిగా అరుస్తున్నాడని అన్నారు. ఉదయం పెట్టాల్సిన చపాతి పెట్టకుండా విద్యార్థులకు పులగం పెట్టారన్నారు. మధ్యాహ్నం పెట్టే చికెన్ కూడా తోలు, కొవ్వు పదార్థాలుగా ఉన్నది పెట్టారని తెలిపారు. విద్యార్థులతో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడడానికి హాస్టల్‌కు వస్తే విద్యార్థిలను కొట్టి కిడ్నాప్ చేయడానికి వచ్చారంటూ, కేసులు పెడతానని ఫోన్ చేసి బెదిరిస్తున్నారని అన్నారు. హాస్టల్లో సమస్యలు బయటికి తెలియజేస్తున్న విద్యార్థి నాయకులపైనే దౌర్జన్యం చేస్తున్న వార్డెన్‌ను విధుల నుంచి పూర్తిగా తొలగించాలని బిసి వెల్ఫేర్ అధికారులను డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న నాయకులు

హాస్పిటలో ఉన్న వారికి రొట్టె పప్పు గుడ్డు అందిస్తున్న సభ్యులు

## దాతల సహకారంతో రోగులకు పౌష్టికాహారం

**ప్రజాశక్తి - డోన్**

దాతల సహకారంతో రోగులకు పౌష్టికాహారం అందిస్తున్నామని ప్రార్థన సమయం మినిస్ట్రీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు జాన.ప్రభాకర్ తెలిపారు. దాతల సహకారంతో ఆదివారం ప్రార్థన సమయం మినిస్ట్రీ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, గర్భవతులకు, బాలింతలకు రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి వెంట వచ్చిన వారు ఈ ఆహారం తింటూ సంతోషిస్తున్నారని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఈ మంచి కార్యక్రమానికి చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లయ్య, ఫక్రుద్దీన్, హోసన్నా వృద్ధాశ్రమం ఆశ్రమ సూపర్వైజర్ మస్తాన్ బి పాల్గొన్నారు.

## జిఒ 52ను రద్దు చేయాలి

**ప్రజాశక్తి - నంద్యాల**

ఇతర కులాలను ఎస్టీ జాబితా లో చేర్చడాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, జిఒ నెంబర్ 52ను, ఏకసభ్య కమిషన్ ను రద్దు చేసి గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని 20వ వార్డు కౌన్సిలర్ మనిపాటి మురళి నంద్యాల ఎంపీని కోరారు. కౌన్సిలర్ ఆధ్వర్యంలో గిరిజన సంఘాల నాయకులు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డిని కలిసి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చితే గిరిజన ప్రజలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఎంపీ స్పందిస్తూ ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళతానన్నారు. కార్యక్రమంలో ఎన్‌టిఎఫ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాగల రాముడు, జిల్లా అధ్యక్షుడు బైరి ఓంకార్, అడ్వకేట్ రామకృష్ణ, మానిపాటి ఆంజనేయులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## అన్ని దానాల్లో అన్నదానం గొప్పది

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

అన్ని దానాలలో అన్నదానం గొప్పదని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సుజాత అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు దాతల సహకారంతో ప్రతిరోజు రాత్రి ఆహారాన్ని అందిస్తున్నారు. ఈ కార్యక్రమం ఆదివారం నాటికి 365 రోజులు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆసుపత్రిలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారు గత సంవత్సర కాలంగా గర్భిణీలకు, బాలింతలకు రాత్రిపూట ఆహారం అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, రిటైర్డ్ హైకోర్టు జడ్జి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కాశీభట్ల శివప్రసాద్, ఉపాధ్యక్షులు గంగన్న, కార్యదర్శి రాము యాదవ్, నిచ్చెనమెట్ల రామయ్య, వంకదార శ్రీధర్, రామాంజనేయులు, కోశాధికారి హెచ్ ఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆగి ఉన కారును ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

**- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు**

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

ఆళ్లగడ్డ మండలంలోని బత్తలూరు గ్రామం దగ్గర ఆగి ఉన్న కారును వెనుక నుండి ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో మాధవరెడ్డి (55) మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయని రూరల్ పోలీసులు తెలిపారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నంద్యాల రైతు నగరంకు చెందిన మాధవరెడ్డి మరో ముగ్గురితో కలిసి బత్తులూరు మజరా బృందావనం గ్రామానికి బయల్దేరారు. బత్తులూరు వద్ద కొద్ది సేపు కారును ఆపగా నంద్యాల నుండి ఆళ్లగడ్డకు వస్తున్న నందికొట్కూరు డిపో బస్సు ఢీకొనడంతో కారులో వెనక సీట్‌లో కూర్చున్న నంద్యాల విజయ పాల డైరీలో పని చేస్తున్న గోనె మాధవరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికి గాయాలయ్యాయి. సమాచారం అందిన ఆళ్లగడ్డ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ నరసింహులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతి చెందిన మాధవరెడ్డి

# కర్నూలు ద్రోహి సిఎం జగన్ : మాజీ ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - బనగానపల్లె**

కర్నూలు ఉమ్మడి జిల్లాలో ఎలాంటి అభివృద్ధి చేయకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ద్రోహిగా మారారని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి విమర్శించారు. ఆదివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విమర్శించే అర్హత ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి లేదన్నారు. కర్నూలు జిల్లాలో చంద్రబాబు నాయుడు పర్యటనకు ప్రజల నుండి విశేష స్పందన లభించడంతో ఓర్వలేక వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా పర్యటనలో అన్ని నిజాలే చెప్పారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.800 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్‌ను పూర్తి చేశారని, పెండింగ్‌లో ఉన్న జిఎన్ఎస్ఎస్ కాలువ ను పూర్తిచేసి కర్నూలు, కడప జిల్లాలకు నీరు ఇచ్చారన్నారు. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ, గనిలో మెగా సోలార్ ప్రాజెక్టు, ఓర్వకల్లులో ఎయిర్ పోర్టు నిర్మించిన ఘనత చంద్రబాబు నాయుడిది అన్నారు. కర్నూలు జిల్లాలో ఇండస్ట్రియల్ హబ్, కొలిమిగుండ్లలో రాంకో సిమెంట్ నిర్మాణానికి చంద్రబాబు కృషి చేశారని తెలిపారు. కమిషన్ల కక్కుర్తి కోసం జిఎన్ఎస్ఎస్ కాల్వకు లైనింగ్ వేసి కర్నూలు జిల్లా రైతులకు భూగర్భ జలాలు పెరగకుండా చేసిన ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. జగన్ ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు విసిగిపోయి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తార్ జహీద్ హుస్సేన్, తెలుగు యువత నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, మిట్టపల్లె సర్పంచ్ తులసి రెడ్డి, మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు ఎర్రగుడి భాస్కర్ రెడ్డి, హుసేనాపురం జాంగిర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

# పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - బండి ఆత్మకూర్**

రాష్ట్రంలో పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వెంగళ్రెడ్డిపేట గ్రామంలో గడపగడపకు వైకాపా ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సర్పంచి పల్లె నాగమణి, నాయకులు పల్లె సోమశేఖర్ రెడ్డి, పల్లె మహేందర్ రెడ్డి, బాలీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు రాగల వెంకటరమణ, వైసిపి మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చిన్నదేవలాపురం గ్రామ సర్పంచ్ ఆవులపాటి మధుసూదన చౌదరి, మాజీ ఎంపిపి దేశం వెంకటరామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వెంగళ్రెడ్డిపేటలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

# ఘనంగా వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబులాల్ పుట్టినరోజు వేడుకలు

**ప్రజాశక్తి - చాగలమర్రి**

చాగలమర్రిలో వైయస్సార్ కాంగ్రెస్ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు ఎంతో అభిమానంతో తీసుకువచ్చిన భారీ కేకును బాబూలాల్ కట్ చేశారు. ఆయనకు సింగిల్ విండో అధ్యక్షులు భూమా చెంచి రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ముల్లా రఫీ, వ్యాపారవేత్త ముల్లా చక్రం షబ్బీర్ , మండల ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో చాగలమర్రిఉపసర్పంచ్ షేక్ సోహెల్, వైసిపి నాయకులు ముల్లా ఖాదరబాష, రాచమడుగు రమణ , షేక్ షబ్బీర్, ముల్లా ఆజిముద్దిన్, ముల్లా ఖాదర్ బాషా, ముల్లా ఇబ్రహీం ముల్లా జాబీర్, ఆలం సార్ గారి అబ్దుల్, జల్సా గౌస్, పప్పీ, అబ్దుల్లా, ఖదీర్, బబ్లు, వార్డు సభ్యులు షేక్షావలి, జాఫర్ వలి, అక్బర్, నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

**అనాధలకు అన్నదానం**

రాష్ట్ర వైసిపి మైనారిటీ సెల్ కార్యదర్శి బాబులాల్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని నగళ్ళపాడు గ్రామ సమీపంలో గల క్రైస్తర అనాధ ఆశ్రమంలో ముల్లా ఖాధర్‌బాష, చక్రం బీడి షబ్బీర్ ఆధ్వర్యంలో వృద్దులకు అన్నదానం చేశారు. బాబులాల్ యువసేన సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బాబులాల్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి కేక్ తినిపిస్తున్న నాయకులు

# అభివృద్ధికి దూరంగా మజరా గ్రామాలు : సిపిఐ

**ప్రజాశక్తి - సిరివెళ్ల**

మండలంలోని చెన్నూరు గ్రామ పంచాయతీ మజరా ఇసుకపల్లె గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని సిపిఐ గ్రామ శాఖ అధ్యక్షులు లింగయ్య. చిలకపాటి ఈశ్వర్ నారాయణలు పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇసుకపల్లె గ్రామంలో వీధిలైట్లు, మురుగునీరు వ్యవస్థ సక్రమంగా లేక రోడ్డుపైనే పారే పరిస్థితి ఉందన్నారు. వర్షం వస్తే నడవడానికి కూడా సరిగా లేని దారులు ఉన్నాయని చెప్పారు. వర్షకాలంలో రోడ్డు మీద మురుగునీరు నిలబడి నాలుగైదురోజులుగా దుర్గంధం వెదజల్లుతూ జనాలు తిరగడానికి కూడా ఇబ్బంది పడుతుంటారని చెప్పారు. గ్రామపంచాయతీ నిధులు ఉన్నా మజరా గ్రామాలకు ఖర్చు చేయడం లేదన్నారు. దాదాపు 650 ఓట్లు ఉన్న ఇసుకపల్లె అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉందని, ప్రత్యేక పంచాయతీగా మార్చాలన్నారు. ఇప్పట్టికైనా అధికారులు స్పందించి గ్రామంలో వీధిలైట్లు, తాగునీరు, సిసి రోడ్లు, డ్రైనేజీ వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, రామయ్య, చిలకపాటి చిన్నయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## మహాసభ కోసం కళాకారులకు శిక్షణ

**ప్రజాశక్తి - బేతంచెర్ల**

వ్యవసాయ కార్మిక సంఘం రెండో జిల్లా మహాసభ బేతంచెర్లలో 27, 28 తేదీలలో జరుగుతున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు కోటపేటలో ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోయిలకొండ నాగరాజు, జిల్లా నాయకులు డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కళాకారులకు, పిల్లలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా నాగరాజు, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చొరవ చూపించాలని కోరారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాన్ని బట్టి చూస్తే భవిష్యత్తులో కళాకారులు కనుమరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. కళాకారులకు ఇస్తున్న పెన్షన్‌ను రూ.3వేల నుండి రూ.5వేలకు పెంచి అంత్యోదయ బియ్యం కార్డు, ఆర్టీసీ బస్సుల్లో రాయితీ అర్హులైన కళాకారులకు పక్క గృహాలు మంజూరయ్యే విధంగా చర్యలు చేపట్టి సంక్షేమ పథకాల్లో ప్రత్యేక విధానాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోటపేట కాలనీవాసులు, వ్యకాసం కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు పలు వార్డులలో గడపగడపకు కార్యక్రమం

**ఆత్మకూర్ :** ఆత్మకూరులోని 4, 9, 10వ వార్డులలో నేడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ మారూప్ ఆసియా తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి హాజరవుతున్నారని, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కొత్తగా ఓటరు నమోదుకు 444 దరఖాస్తులు

**ఆళ్లగడ్డ :** నియోజవర్గంలో కొత్తగా ఓటర్ నమోదుకు 444 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎన్నికల ఉప తహశీసిల్దార్ రవీంద్ర ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ శనివారం, ఆదివారం జరిగిన ప్రత్యేక ఓటు హక్కు నమోదు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా బూత్ లెవెల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు జరిగాయన్నారు. రెండు రోజులలో కొత్తగా ఓటు హక్కు నమోదు కోసం 444 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీటిని పరిశీలించి సరైన వాటిని ఓటర్ల జాబితాలో చేరుస్తామన్నారు. అలాగే చిరునామా, పోలింగ్ కేంద్రాల మార్పు కోరుతూ 87 దరఖాస్తులు, ఓటు తొలగింపునకు 8 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వచ్చే నెల 3, 4వ తేదీలలో మరోసారి ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు.

## అయ్యప్ప ఆలయ పరిసరాలను చైర్మన్ పరిశీలన

**నందికొట్కూరు :** నందికొట్కూరు పట్టణంలోని ఆత్మకూరు రోడ్డులోని అయప్పస్వామి దేవాలయం పరిసరాలను మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. శ్రీశైల జగద్గురు డాక్టర్ చెన్నసిద్దరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి వారి మహా పాదయాత్ర ఈ నెల 24న గురువారం నందికొట్కూరు పట్టణానికి చేరుకుంటున్న సందర్భంగా అయ్యప్ప ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేయనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ భాను ప్రతాప్, బిసి నాయకులు కాశ్వారి శివ ప్రసాద్, చింత విజ్జి, బీటెక్ రాజు, సాపూరు శంకరప్ప, జెపి నాగేశ్వరయ్య, కేదారేశ్వరప్ప, వైసిపి నాయ కులు కిరణ్ కుమార్ రెడ్డి, పి.రమేష్ తదీతరులు పాల్గొన్నారు

## స్వచ్ఛ నంద్యాలలో భాగమే ఆక్రమణల తొలగింపు

**- మున్సిపల్ కమిషనర్ సి.రవి చంద్రారెడ్డి**

**నంద్యాల కలెక్టరేట్ :** నంద్యాల జిల్లా కేంద్రాన్ని స్వచ్ఛ నంద్యాలగా తీర్చిదిద్దడంతో పాటు, సుందరీకరణలో భాగంగా పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు అక్రమణల తొలగింపు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలు చోట్ల జరుగుతున్న ఆక్రమణల తొలగింపులను కమిషనర్ పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఫుట్ పాత్‌లపై ఉన్న సైన్ బోర్డులు, మెట్లు, ర్యాంపులు, అడ్డగోడలు, అనుమతులు లేని కట్టడాలను తొలగిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో 11 బృందాలు 11 జెసిబిలు, 11 ట్రాక్టర్లు, 15 మంది సిబ్బందిని నియమించామన్నారు. చిరు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించబోమని తెలిపారు.

## ఎస్‌సిల నిధులను వాడుకునే హక్కు సిఎంకు ఎవరిచ్చారు : టిడిపి

**నంద్యాల అర్బన్ :** ఎస్‌సిల నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సొంత పథకాలకు వాడుకునే హక్కు ఎవరిచ్చారని టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మద్దికెర కైలాస్ ప్రశ్నించారు. ఆదివారం నంద్యాలలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీలకు కేటాయించిన రూ.9,905.42 కోట్లు వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించడాన్ని తీవ్రంగా ఖండించారు. దళిత ద్రోహి జగన్ రెడ్డి నియంతృత్వ పాలనను సాగనంపడానికి టిడిపి ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో దళిత సమరభేరి ర్యాలీలను వచ్చే నెల 5న విజయవాడలో నిర్వహిస్తున్నామని చెప్పారు. సక్రాంత్రి తర్వాత జైభీం, జై టిడిపి అనే నిరంతర కార్యక్రమాన్ని మొదలుపెట్టి దళిత వాడలలోని ప్రతి ఇంటికి జగన్ మోహన్ రెడ్డి దళిత వ్యతిరేక విధానాలను ప్రచారం చేసి దళితులను చైతన్యపరుస్తామని తెలిపారు.

## పారిశుధ్య కార్మికుని మృతికి సిఐటియు నివాళి

**డోన్ :** డోన్ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పి.సుంకన్న (48) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతికి సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం, మండల కార్యదర్శి పి.రామాంజనేయులు సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక రాజీవ్ నగర్ లోని మృతుని స్వగహంలో భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతునికి భార్య సుంకమ్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారన్నారు. సుంకన్న విధుల పట్ల అంకితభావంతో పనిచేసేవాడని అటువంటి మంచి మనిషి అకాల మరణం బాధాకరమని, కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకటేశ్వర్లు, అన్ని విధాలుగా అండగాఉంటామని తెలిపారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో వైస్ చైర్మన్ కె.హరికిషన్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప, ఉపాధ్యక్షులు పెద్ద ఎల్లయ్య,మేస్త్రీలు లక్ష్మిరెడ్డి,దానం, సుధాకర్,మున్సిపల్ కార్మికులు ఉన్నారు.

నివాళ్లులర్పిస్తున్న శివరాం, రామాంజనేయులు

# ముగిసిన గ్రంధాలయ వారోత్సవాలు

**- ఆటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం**

**ప్రజాశక్తి - నంద్యాల**

స్థానిక గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ముగింపు సమావేశానికి తెలుగు పండిట్ అన్నెం శ్రీనివాస రెడ్డి అధ్యక్షత వహించారు. గ్రంధాలయాధికారి ఎస్ .రాధా బాయి పర్యవేక్షించగా ముఖ్య అతిథిగా నంద్యాల వార్డు కౌన్సిలర్ సరస్వతి హాజరై మాట్లాడారు. అనంతరం కౌన్సిలర్‌ను సత్కరించారు. రచయిత కొప్పుల ప్రసాద్ 'పసినవ్వుల అలలు' పుస్తక సంకలనాన్ని గ్రంధలయానికి అందజేశారు. పలు పోటీల విజేతలకు కౌన్సిలర్ మెమెంటోలు బహూకరించారు. కార్యక్రమంలో పాఠకులు, మిడ్ టౌన్ రోటరీ క్లబ్ మజీ అధ్యక్షులు నాగరాజు, రచయితలు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** చాగలమర్రిలోని భారతీ విద్యా మందిరం పాఠశాలలో గ్రంధాలయ అధికారి రామచంద్రుడు ఆధ్వర్యంలో వివిధ రకాల ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు ఉపసర్పంచి సోహెల్ బహుమతులను అందజేశారు. పాఠశాల కమిటీ సభ్యులు మేడా ప్రభాకర్, చెంచు సుబ్బారావు, సుంకు రాజేష్, హెచ్‌ఎం ప్రసాద్, కాంతారావు, మహమ్మద్, సిబ్బంది లాలయ్య తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** గ్రంధాలయాలు విజ్ఞాన కేంద్రాలని ప్రియదర్శిని ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సభేరా పేర్కొన్నారు. గ్రంధాలయాధికారి జలాల్ బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సుధాకర్ రెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం శ్రీరాములు, గ్రంధాలయ సిబ్బంది పాల్గొన్నారు. **సిరివెళ్ల :** గ్రంధాలయంలో విజేతలైన విద్యార్థులకు కస్తూరిబా గాంధీ స్కూల్ టీచర్ ఫిర్దోస్ బహుమతులు ప్రదానం చేయడం జరిగినది. లైబ్రేరియన్ శౌరెడ్డి, సిబ్బంది రఫీ పాల్గొన్నారు. **వెలుగోడు :** గ్రంధాలయ అధికారి సుమలత ఆధ్వర్యంలో ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులు ఎంపీపీ రమేష్, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సిపిఎం, ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ రఫీ పాల్గొన్నారు. మొదటగా దాడిచర్ల హరిసర్వోత్తమరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. లిటిల్ ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంట్ ఇమ్మానియేల్, కస్తూరిబా పాఠశాల హెచ్‌ఎం మధుసూదనాదేవి, జడ్పీహెచ్ హైస్కూల్ లైబ్రేరియన్ బందె నాయక్, వెలుగోడు వికలాంగుల సంఘం రంగస్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** ముఖ్య అతిథులుగా హనుమంతరావు, డిప్యూటీ డిఈఓ జి. శేషాద్రి శర్మ, రిటైర్డ్ గ్రేడ్-2 లైబ్రేరియన్, పైపాలెం సర్పంచ్‌లు బహుమతులు ప్రదానం చేశారు. **ఆళ్లగడ్డ :** గ్రంధాలయ అధికారి బాల తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో వెంకటసుబ్బయ్య, బీడీసీ నిర్వాహకులు మద్దిలేటి, మ్యూజికల్ టీచర్ మాధవి లత, ఇంగ్లీషు ట్రైలర్ లిఖితలు విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు. **కోవెలకుంట్ల :** పట్టణంలోని శాఖా గ్రంధాలయంలో గ్రంధాలయ ఇన్చార్జ్ పి.రామదాసు పర్యవేక్షణలో విజేతలకు ఎంఇఓ బాలతిమ్మారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు, బిడిసి నిర్వాహకుడు పి.జగన్, రజియ పాల్గొన్నారు.

శిరివెళ్లలో...

నంద్యాలలో..

వెలుగోడులో...

# రాష్ట్రస్థాయి పరీక్షలో ఆత్మకూరు విద్యార్థిని ప్రతిభ

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

రాష్ట్ర సాంస్కృతిక సంస్థ నిర్వహించిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి తెలుగు ప్రతిభా పరీక్షలో ఆత్మకూరు కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రవళిక 100కు 94 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ వి.శ్యామల తెలిపారు. ఆదివారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో మెమొంటో, ప్రశంసాపత్రం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి వేణుగోపాల చారి చేతుల మీదుగా విద్యార్థిని అందుకున్నట్లు తెలిపారు. ప్రవళికను ఉపాధ్యాయునులు అభినందించారు.

మెమొంటోని అందుకుంటున్న విద్యార్థిని ప్రవల్లిక

## అంతర్ కళాశాలల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**బనగానపల్లె :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అంతర్ కళాశాలల పోటీలలో ప్రతిభను కనబరిచి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత, ఫిజికల్ డైరెక్టర్ విజయకుమారిలు ఆదివారం తెలిపారు. నంద్యాలలోని ఆర్కే అకాడమీ స్టేడియంలో నిర్వహించిన రాయలసీమ అంతర్ కళాశాల మహిళా ,పురుషుల షటిల్, టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలలో బనగానపల్లె జట్టు టేబుల్ టెన్నిస్ ఫైనల్‌లో చేరి ఉస్మానియా డిగ్రీ కళాశాల జట్టుపై విజయం సాధించిందన్నారు. విద్యార్థులను అభినందించారు. కోచ్ సయ్యద్ హుస్సేన్, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నతనం నుంచే మంచి అలవాట్లు నేర్పించాలి

**చాగలమర్రి :** చిన్న వయసు నుంచే బాలికలకు మంచి అలవాట్లను తల్లిదండ్రులు నేర్పించాలని రెవరెండ్ సంపత్ కుమార్ తెలిపారు. ఆదివారం పెద్ద భోదనం గ్రామంలో సిఎస్ఐ చర్చిలో నంద్యాల అధ్యక్ష ఖండపు బిషప్ పుష్ప లలిత ఆదేశాల మేరకు బాలికల సంరక్షణ దినం నిర్వహించారు. అనంతరం బాలికలనుదేశించి ఆయన ప్రసంగించారు. సంఘ పెద్దలు ధోనిదానం, జ్ఞాన సుందరం, సంఘ సభ్యులు సుధాకర్, మహిళలు పాల్గొన్నారు.

# హాకీ క్రీడ అభివృద్ధికి కృషి చేయాలి

**ప్రజాశిక్త - చాగలమర్రి**

రాష్ట్రంలో హాకీ క్రీడాభివృద్ధికి అన్ని జిల్లాల హాకీ సంఘం అధ్యక్షులు కృషి చేయాలని రాష్ట్ర హాకీ సంఘం అధ్యక్షులు చాణిక్యరాజు తెలిపారు. మండలంలోని బర్డ్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో హాకీ సంఘం రాయలసీమ జిల్లాల అధ్యక్షులతో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అంతరజిల్లాల జూనియర్ బాలుర హాకీ పోటీలకు బర్డ్స్ క్రీడా మైదానం ఆతిథ్యం ఇస్తుందని తెలిపారు. అనంతరం జాతీయ మహిళా హాకీ పోటీల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. త్వరలో అంతర్ జిల్లాల జూనియర్ బాలుర హాకీ పోటీలను నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో బర్డ్స్ సంస్థల అధినేత పాల్ రాజారావు, వివిధ జిల్లాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర హాకీ సంఘం అధ్యక్షులు చాణిక్యరాజు

## కార్తీక కడ సోమవారానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

**ప్రజాశక్తి - అవుకు**

కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని కాశీ విశ్వనాథ స్వామి ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాశీ విశ్వనాథ భజన బందం సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయము 7 గంటల నుండి అన్నదాన కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా జరిపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. శివాలయాల్లో భక్తులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మహిళలు దీపాలను వెలిగించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

## డ్రైవర్ రమణ మాతృమూర్తిని పరామర్శించిన బిసి దంపతులు

**ప్రజాశక్తి - బనగానపల్లె**

మాజీ ఎమ్మెల్యే బిసి వ్యక్తిగత వాహన డ్రైవర్ ఆర్‌వి రమణ తల్లి అనారోగ్యంతో నంద్యాల ఉదయానంద్ వైద్యశాలలో చికిత్స పొందుతుండడంతో మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి ఆయన సతీమణి రాష్ట్ర థాయ్ బాక్సింగ్ చైర్మన్ బిసి ఇందిరాలు ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట టిడిపి నాయకులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి ఉన్నారు.


మహారాజశ్రీ నంద్యాల జిల్లా, ఆత్మకూరు
సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
HMOP No. 42/2022

గూడెం నాగరత్నమ్మ @ మద్దూరు నాగరత్నమ్మ
W/o. మద్దూరు భాస్కరరావు
R/o. H.No. 69-601, జోహరపురం,
ప్రభుత్వ పాఠశాల దగ్గర, కర్నూలు. .... అర్జీదారురాలు
-V/s-
మద్దూరు భాస్కరరావు, S/o. సుంకన్న, H.No 2-9A,
మద్దూరు గ్రామము, పాముపాడు మండలము,
నంద్యాల జిల్లా. సెల్ : 9966458583
... రెస్పాండెంటు

నోటీసు

ఇందుమూలముగా మద్దూరు భాస్కరరావు/ రెస్పాండెంట్ వారికి తెలియజేయడం మేమనగా పై కేసులో అర్జీదారురాలు అయినటువంటి గూడెం నాగరత్నమ్మ మీ నుండి విడాకులు మంజూరు చేయాలని కోరుతూ పై కోర్టులో అర్జీదాఖలు చేసినది. సదరు కేసులో మీరు హాజరు కావలనీ 16-12-2022వ తేదికి వాయిదా వేసినారు. కావున రెస్పాండెంటు అయిన మీరుపైన తెలిపిన తేదీన ఉదయం 10:30 గంIIలకు పై కోర్టులో హాజరై మీరుగాని, మీ తరపున న్యాయవాది ద్వారా గానీ మీ తరపున సంజాయిసి చెప్పుతూ రిటన్ స్టేట్‌మెంట్‌ను దాఖాలు చేసుకోవలసినదిగా తెలపడమైనది. కావున మీరు పై తేదీన పైన తెలిపిన కోర్టుకు హాజరుకాని యెడల సదరు కేసును నీ పరోక్షము నందు చట్టరీత్యా తగిన విధముగా తీర్మాణించబడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా తేది : 16-12-2022

R. BALARAM NAIK, M.A., LLM.,
Advocate,
Atmakur.
Cell : 98858 58608

ALLAGADDA MUNICIPALITY
***
Address : Ahobilam Road, Allagadda
Telephone No. : 8978885220
E-mail Id : mc.allagadda@cdma.gov.in

E-Tender :- CC Road Work

Tender Notification No. 7/CMDF-2022-23/ALGM: Dated 21-11-2022 (2nd Call)

| | | |
|---|---|---|
| Bid Document Download Start Date and Time | : | 21-11-2022 @ 10.00 AM |
| Bid Document Download End Date and Time | : | 05-12-2022 @ 04.00 PM |
| Bid Submission Closing Date and Time | : | 05-12-2022 @ 04.30 PM |

E-Tender Website : https://tender.apeprocurement.gov.in/
E-Mail ID for Clarifications/Communication : mc.allagadda@cdma.gov.in
Note : Any addendum/corrigendum/bid clarifications/time extension shall be issued on the website only. No separate press notification shall be issued.

Contact No : 8978885220 & 9398828017

Sd/- A.V Ramesh Babu
Commissioner
Allagadda Municipality